నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం

**నేటి కందం- నేటికి అందం**

**బంగారము కురియు తె**
**లంగాణములోని హైదరాబాద్ లోనన్**
**నింగిని దాకెడి శాఫ్రను**
**వంగడనును మన ప్రధాని ప్రారంభించెన్ !!**

విమానాలను నిర్వహించే,రిపేరు చేసే, శాఫ్రన్ కంపెనీ యూనిట్ ను ప్రధాని మోడీ హైదరాబాద్ లో వర్చువల్ గా ప్రారంభించారు. రేవంత్ రెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు

-రాధశ్రీ
సెల్:9494481210



# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com   ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433   E-mail:netinijam93@gmail.com

నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం

చురక

**తమ తాతలు నేతులు**
**తాగిండ్రని నీతులు**
**తమపాలనే గొప్పదంటూ**
**తెగని రోత కోతలు**
**విమర్శల పేరు మీద**
**విసురుకునే బూతులు**
**డ్రేయినేజి పొంగులాగ**
**దుర్గంధపు మూతలు**

-వేల్పుల నారాయణ
9440433475



హైదరాబాద్ శుక్రవారం 28-11-2025   NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 ▪ Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001.   సంపుటి :32   సంచిక:90   పేజీలు:6   వెల: రూ.1/-

## ఇండస్ట్రియల్ పాలసీలో కుంభకోణానికి ఆస్కారమే లేదు



హైదరాబాద్, నవంబర్ 27:ఇండస్ట్రియల్ పాలసీ పై కొంతమంది అసత్య ప్రచారం చేస్తున్నారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. భాగ్యనగరాన్ని పొల్యూషన్ ఫ్రీ గా చేయడమే తమ ప్రభుత్వ పాలసీ లక్ష్యమని వ్యాఖ్యానించారు. ఈ పాలసీలో కుంభకోణానికి ఆస్కారమే లేదని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం తెచ్చింది పారదర్శకమైన పాలసీ అని చెప్పుకొచ్చారు. ఇవాళ(గురువారం) గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి.

బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు తాము తెచ్చిన ఇండస్ట్రియల్ పాలసీ అర్థం కాలేదని తెలిపారు. ప్రతిపక్షాల నేతలు కావాలనే తమ ప్రభుత్వంపై బురద జల్లుతున్నారని ధ్వజమెత్తారు. హైదరాబాద్ నగరాన్ని కాలుష్య రహితంగా మార్చేందుకు ఇండస్ట్రీలను బయటకు పంపాలనే డిమాండ్ ఉందని గుర్తుచేశారు. ఈ పాలసీ తమ ప్రభుత్వం కొత్తగా తెచ్చినది కాదని వివరించారు. కేసీఆర్ ప్రభుత్వంలో కూడా ఈ పాలసీపై చర్చ జరిగిందని గుర్తుచేశారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి.

బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చేది లేదని... పాలసీ మార్చేది లేదని చెప్పుకొచ్చారు. ఇండస్ట్రియల్ పాలసీ రూపకల్పనలో తాను భాగమై ఉన్నానని వివరించారు. కొత్త ఇండస్ట్రియల్ పాలసీతో తెలంగాణ రాష్ట్రానికి అదనపు ఆదాయం వస్తుందని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేసినా ప్రతిపక్షాల నేతలకు వ్యతిరేకించాలనే ఉద్దేశ్యం తప్పా ఏం లేదని విమర్శించారు. అయితే, నల్గొండ డీసీసీ నియామకంపై స్పందించడానికి నిరాకరించారు. పార్టీ ఇంటర్నల్ విషయాలను బయట మాట్లాడనని తెలిపారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి.

తమ ప్రభుత్వంలో విద్యుత్ శాఖలో ఎలాంటి కుంభకోణం జరగలేదని చెప్పుకొచ్చారు. కేసీఆర్ హయాంలో భద్రాద్రి కొత్తగూడెం పవర్ ప్రాజెక్టు పెద్ద కుంభకోణం జరిగిందని ఆరోపించారు. గత ప్రభుత్వం ఇండియా బుల్ అనే కంపెనీ దగ్గర ఉపయోగంలో లేని ఎక్విప్‌మెంట్ ఎందుకు కొన్నదని ప్రశ్నించారు. భద్రాద్రి ప్రాజెక్టులో అవుట్ డేటెడ్ టెక్నాలజీ వాడాల్సిన అవసరం ఏముంది.. అని నిలదీశారు. భద్రాద్రి ప్రాజెక్టు అనవసరంగా తెలంగాణ ప్రజలపై రుద్దిన ప్రాజెక్టు అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శలు చేశారు.

## 2019లో చేపట్టిన గ్రూప్-2 నియామకాలను సింగిల్ బెంచ్ తీర్పు రద్దు

### - గ్రూప్-2పై తెలంగాణ హైకోర్టు కీలక తీర్పు



హైదరాబాద్ నవంబర్ 27 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: 2015 గ్రూప్ -2 ర్యాంకర్లకు ఊరట లభించింది. గ్రూప్-2పై తెలంగాణ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. సింగిల్ బెంచ్ తీర్పును హైకోర్టు డివిజన్ బెంచ్ సస్పెండ్ చేసింది. 2019లో చేపట్టిన గ్రూప్-2 నియామకాలను సింగిల్ బెంచ్ తీర్పును రద్దు చేసింది. 2019 గ్రూప్-2 ఫలితాలపై సింగిల్ బెంచ్ తీర్పును సవాల్ చేస్తూ డివిజన్ బెంచ్‌ను టిజిపిఎస్సి ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పై గురువారం హైకోర్టులో విచారణ చేపట్టింది. సింగిల్ బెంచ్ తీర్పును సస్పెండ్ చేయడంతో పాటు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి విచారణను ఆరు వారాలకు వాయిదా వేసింది. వైటనర్ వినియోగం, దిద్దుబాట్ల ఉన్న పార్ట్ బి జవాబు పత్రాలను తిరిగి మూల్యాంకనంపై అసహనం వ్యక్తం చేసింది. ఒశ్రీబనీ ఖీవజీట - తనిఖీ చేస్తున్న కార్మికులను ఢీకొట్టిన రైలు.. 11 మంది మృతి ంటలవతీబితిబవఎవనిబి ఆన్సర్ నీట్లలో ట్యాంపరింగ్ జరిగినా కూడా వాటిని కరెక్షన చేయడం మంచి పద్ధతి కాదని తెలిపింది. సాంకేతిక కమిటీ సూచనల ప్రకారం రీ కరెక్షన్ చేసి అభ్యర్థుల అర్హుల జాబితాను విడుదల చేయాలని సూచించింది. ఎనిమిది వారాల్లోనే ఈ ప్రక్రియను ముగించాలని ఆదేశించింది. 2019 అక్టోబర్ 24న ఇచ్చిన ఫలితాలు ఏకపక్షమని, చట్టవిరుద్ధమని వాటిన రద్దు చేస్తామని హైకోర్టు తెలిపిన విషయం విధితమే. సాంకేతిక కమిటీ సిఫారసుల మేరకు హైకోర్టు గత తీర్పుకు తగ్గట్టుగా తిరిగి మూల్యాంకనం నిర్వహించడంతో పాటు అర్హుల జాబితాను విడుదల చేసి నియామకాలు చేపట్టాలని సూచనలు చేసింది. ఈ తీర్పుపై టిజిపిఎస్సి డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించగా కోర్టు సింగిల్ బెంచ్ తీర్పును రద్దు చేస్తూ ఇప్పుడు తీర్పునిచ్చింది.

## బీసీలను 17 శాతానికి తగ్గించిందన్న కేటీఆర్ వ్యాఖ్యలకు సీతక్క స్ట్రాంగ్ కౌంటర్

హైదరాబాద్, నవంబర్ 27: స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను 17 శాతానికి తగ్గించిందన్న కేటీఆర్ వ్యాఖ్యలకు మంత్రి సీతక్క స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. కేటీఆర్ ప్రచారం చేస్తున్నట్లుగా బీసీల రిజర్వేషన్‌లు ఎక్కడా తగ్గలేదని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్లు తగ్గించి గొంతు కోసిందే బీఆర్ఎస్ అని ఆరోపించారు. 2014 లో జరిగిన స్థానిక ఎన్నికల్లో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించిందని.. కానీ 2019 ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం బీసీల రిజర్వేషన్లను 34 శాతం నుంచి 22 శాతానికి తగ్గించిందని గుర్తుచేశారు. బీసీ రిజర్వేషన్లను తగ్గించి తడిబట్టతో బీసీల గొంతు కోసింది బీఆర్ఎస్ అంటూ విరుచుకుపడ్డారు. ఇప్పుడు బీసీల గురించి మాట్లాడే నైతిక హక్కు కేటీఆర్‌కు లేదన్నారు.

అబద్ధాలకు అంబాసిడర్‌గా మారి కేటీఆర్ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని బీసీలు విశ్వసించరని తెలిపారు. గత స్థానిక ఎన్నికల్లో రాష్ట్రం యూనిట్‌గా సర్పంచుల రిజర్వేషన్లు ఖరారు చేశారని.. కానీ ఆ విధానాన్ని సుప్రీంకోర్టు తప్పు పట్టిందన్నారు. సర్పంచుల రిజర్వేషన్ల ఖరారుకు రాష్ట్రం యూనిట్‌గా కాకుండా మండలాన్ని యూనిట్‌గా తీసుకోవాలని సుప్రీంకోర్టు తీర్పునిచ్చిందని తెలిపారు. అందుకోసం ప్రత్యేకంగా డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని కూడా చెప్పిందని సుప్రీం తీర్పును మంత్రి గుర్తు చేశారు. సుప్రీంకోర్టు తీర్పు మేరకు డెడికేటెడ్ కమిషన్ ఏర్పాటు చేసి, దాని సిఫార్సు మేరకు మండలం యూనిట్‌గా సర్పంచుల రిజర్వేషన్ల నిర్ణయం జరిగిందన్నారు.

ఆయా మండలాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీల జనాభాను బట్టి సర్పంచుల రిజర్వేషన్లు ఖరారు అయ్యాయని తెలిపారు. అందుకే కొన్ని మండలాల్లో రిజర్వేషన్లు పెరిగినట్లుగా, మరికొన్ని మండలాల్లో తగ్గినట్లుగా పైకి కనిపిస్తున్నా, స్టేట్ యూనిట్‌గా చూస్తే ఎక్కడా రిజర్వేషన్లు తగ్గలేదని వెల్లడించారు. ఏ మండలంలో కూడా రిజర్వేషన్లు 50 శాతానికి మించి ఉండరాదని సుప్రీంకోర్టు ఆదేశించిందన్నారు. రిజర్వేషన్ల ఖరారులో సుప్రీంకోర్టు తీర్పులను అమలు చేశామని వివరించారు. సుప్రీం తీర్పును అపహాస్యం చేసినట్లుగా కేటీఆర్ వ్యవప ారిస్తున్నారని మండిపడ్డారు. కుల గణన చేపట్టి పక్కాగా రిజర్వేషన్లు అమలు చేస్తున్నామని తెలిపారు.

కుల గణనలో పాల్గొనని కేసీఆర్ కుటుంబం, బీసీ రిజర్వేషన్లపై నన్నాయి నొక్కులు నొక్కుతోందని వ్యాఖ్యలు చేశారు.

## రైల్వే కార్మికులపైకి దూసుకెళ్లిన రైలు..

## 11 మంది మృతి

బీజింగ్, నవంబర్ 27: రైలు పట్టాల వద్ద పని చేస్తున్న రైల్వే కార్మికులపైకి రైలు దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో 11 మంది కార్మికులు మరణించారు. మరో ఇద్దరు గాయపడ్డారు. వారిని హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. నైరుతి చైనాలోని యునాన్ ప్రావిన్స్‌లో ఈ సంఘటన జరిగింది. గురువారం తెల్లవారుజామున 'భూకంప పరికరాల పరీక్ష కోసం ఉపయోగించే' టెస్టింగ్ ట్రైన్ కున్మింగ్‌లోని లుయోయాంగ్ టౌన్ స్టేషన్‌లో ప్రయాణించింది.

కాగా, వంపుగా ఉన్న రైలు పట్టాల వద్ద కొందరు కార్మికులు పని చేస్తున్నారు. అయితే ఆ పట్టాలపై ప్రయాణించిన ఆ రైలు వారి మీదకు దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో 11 మంది రైల్వే కార్మికులు మరణించారు. మరో ఇద్దరు గాయపడ్డారు. వారిని హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు.

మరోవైపు చైనాలో దశాబ్దానికి పైగా జరిగిన అత్యంత ఘోర ప్రమాదంగా ఆ దేశ రైల్వే అధికారులు అభివర్ణించారు. ఈ ప్రమాదంపై దర్యాప్తు చేస్తున్నారు. గురువారం మధ్యాహ్నానికి రైళ్ల రాకపోకలను పునరుద్ధరించారు.

## బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు

## 21 సంవత్సరాల జైలు శిక్ష

ఢాకా నవంబర్ 27 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు బిగ్ షాక్ తగిలింది. మూడు అవినీతి కేసుల్లో ఆమెకు బంగ్లాదేశ్ కోర్టు గురువారం 21 సంవత్సరాల జైలు శిక్ష విధించినట్లు స్థానిక మీడియా వెల్లడించింది. ప్రభుత్వ ఆధ్వర్యంలోని బీఎస్ఎస్ వార్తా సంస్థ ప్రకారం.. పుర్బాచోల్‌లోని రాజుక్ న్యూ టౌన్ ప్రాజెక్ట్‌లో ప్లాట్ల కేటాయింపులో అక్రమాలు జరిగాయనే ఆరోపణలపై ఈ మూడు కేసులు హసీనాపై దాఖలు చేయబడ్డాయి. మూడు కేసుల్లో ప్రతి కేసులోనూ కోర్టు ఏడు సంవత్సరాల జైలు శిక్ష విధిస్తూ ఢాకా స్పెషల్ కోర్టు తీర్పు వెల్లడించింది. ఈ కేసుల్లో షేక్ హసీనా కొడుకు, కూతురికి కూడా కోర్టు శిక్ష విధించింది. ఆమె కుమారుడు సజీబ్ వాజెద్ జాయ్‌కు కోర్టు ఐదు సంవత్సరాల జైలు శిక్ష, లక్ష టాంకుల జరిమానా విధించగా.. కుమార్తె సైమా వాజెద్ పుతుల్ కు ఐదు సంవత్సరాల జైలు శిక్ష విధించింది.

## హైదరాబాద్‌లో సీసీ కెమెరాల నిర్వహణకు ప్రత్యేక బృందాలు.. ప్రారంభించిన సీపీ

హైదరాబాద్, నవంబర్ 27: నేరాలను అరికట్టడంలో సీసీ కెమెరాలు ముఖ్యపాత్ర పోషిస్తాయి. ఎక్కడైన హత్య, దొంగతనం జరిగినా ఆయా ప్రాంతాల్లో ఉన్న సీసీ కెమెరాలు దొంగలను ఈజీగా పట్టించేస్తుంటాయి. ప్రజల భద్రత, నేరాల నియంత్రణ, నిందితులను గుర్తించడానికి సీసీ కెమెరాలు ఉపయోగపడతాయి. ఇప్పటికే తెలంగాణ రాష్ట్రంలోని ప్రధాన జిల్లాలో పెద్ద సంఖ్యలో సీసీ కెమెరాలు ఏర్పాటు అయిన విషయం తెలిసిందే. దీని ద్వారా చాలా వరకు మహిళలపై దారుణాలు, దొంగతనాలు తగ్గాయనే చెప్పుకోవచ్చు. తాజాగా సీసీ కెమెరాల నిర్వహణకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.

భాగ్యనగరంలో సీసీ కెమెరాల నిర్వహణకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసింది. ప్రత్యేక బృందాలకు వాహనాలు, క్రేన్లు ఇతర సామాగ్రిని పోలీసులు సమకూర్చారు. అలాగే ఈ బృందాలకు ఎంపవరింగ్ ఎవ్రీ డే సేఫ్టీ టీమ్స్ (ఇజఇూ) అంటూ నామకరణం చేశారు. ఇజఇూ బృందాలను ఈరోజు (గురువారం) సీపీ సజ్జనార్ ప్రారంభించారు. నగరంలో ఉన్న సీసీటీవీ కెమెరాలు ఎప్పటికప్పుడు మానిటర్ చేయడం, మరమ్మతు చేస్తూ కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానంగా పనిచేయనున్నాయి. ఈ కార్యక్రమంలో నగర పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## మళ్లీ తుఫాన్.. పోర్టుల్లో ప్రమాద హెచ్చరికలు జారీ

విశాఖపట్నం, నవంబర్ 27: శ్రీలంకను అనుకుని ఉన్న నైరుతి బంగాళాఖాతంలో తుఫాన్ ఏర్పడింది. ఈ మేరకు విశాఖపట్నంలోని తుఫాన్ హెచ్చరికల కేంద్రం ఉన్నతాధికారి జగన్నాథ కుమార్ వెల్లడించారు. ఈ తుఫాన్‌కు దిత్వాగా అని యమెన్ పేరు పెట్టిందని తెలిపారు. ఈ తుఫాన్ కారణంగా రానున్న వారం రోజుల్లో ఆంధ్రప్రదేశ్‌లో వర్షాలు కురుస్తాయని చెప్పారు. కొన్ని ప్రాంతాల్లో తేలిక పాటి నుంచి భారీ వర్షాలు.. మరి కొన్ని ప్రదేశాల్లో భారీ వర్షాల నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ సమయంలో తీరం వెంబడి గరిష్టంగా 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందన్నారు. కాబట్టి సముద్రంలో వేటకు వెళ్ళ వద్దని మత్స్యకారులను హెచ్చరించారు. తీరం వెంబడి ఉన్న పోర్టులో రెండో నెంబరు ప్రమాద హెచ్చరికను జారీ చేశామని జగన్నాథ కుమార్ వివరించారు.ఇక దిత్వా తుఫాన్ కారణంగా.. శనివారం నుంచి సోమ వారం వరకు అంటే.. నవంబర్ 29 నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకు భారీ వర్షాలు కురుస్తాయిన అంచనా వేస్తున్నారు. 29వ తేదీన అన్నమయ్య, నెల్లూరు, చిత్తూరు, తిరుపతి జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించారు. ఇక 30వ తేదీన నెల్లూరు, అన్నమయ్య, చిత్తూరు, ప్రకాశం, వైఎస్ఆర్ కడప జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించారు.

## సిగాచీ పేలుళ్ల ఘటనపై తెలంగాణ హైకోర్టు ఆగ్రహం



హైదరాబాద్, నవంబర్ 27: సిగాచీ పేలుళ్ల ఘటనలో పోలీసుల దర్యాప్తు తీరుపై తెలంగాణ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. సిగాచీ పేలుళ్లపై దాఖలైన పిల్‌పై ఈరోజు (గురువారం) హైకోర్టులో విచారణ జరుగగా.. సీజే కీలక వ్యాఖ్యలు చేశారు. ఇది సాధారణ ఘటన కాదని, 54 మంది కార్మికులు చనిపోయారన్నారు. ఇంకా దర్యాప్తు కొనసాగుతోందని చెప్పడమేంటని ఏఏజీ తేరా రజినీకాంత్ రెడ్డిని సీజే ప్రశ్నించారు. 237 మంది సాక్షులను విచారించినా ఇప్పటి వరకు దర్యాప్తులో ఎలాంటి పురోగతి లేదన్నారు. ఇప్పటి వరకు ఘటనకు బాధ్యులెవరని తేల్చలేదా అని ప్రశ్నించారు.

ఇంత పెద్ద ఘటన జరిగితే డీఎస్పీని ఎందుకు దర్యాప్తు అధికారిగా నియమించారని ఏఏజీని సీజే నిలదీశారు. దర్యాప్తు కోసం ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు చేసి ఉండొచ్చు కదా అని సీజే ప్రశ్నించారు. కాగా.. సిగాచీ పేలుళ్లపై బాబు రావు అనే వ్యక్తి హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. పేలుడు సంభవించి 5 నెలలు దాటినా ఇప్పటి వరకు ఎవరినీ అరెస్ట్ చేయలేదని న్యాయవాది వసుధా వాదనలు వినిపించారు. నిపుణల కమిటీ కూడా పరిశ్రమల నిర్వహణలో లోపాలున్నాయని తేల్చిందన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా 17 టన్నుల సోడియం క్లోరైడ్ నిల్వ చేశారని కమిటీ గుర్తించిందని లాయర్ వెల్లడించారు. పేలుడు తీవ్రతకు 8 మంది శరీరాలు ఆనవాళ్లు లేకుండా కాలిపోయాయని న్యాయవాది వసుధా కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. నిపుణుల కమిటీ నివేదిక ఆధారంగా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని ఏఏజీ తేరా రజినీకాంత్ కోర్టుకు తెలిపారు. దీంతో పోలీసు దర్యాప్తు నివేదిక సమర్పించాలని ఏఏజీని హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణకు దర్యాప్తు అధికారి డీఎస్పీ కోర్టు ఎదుట హాజరు కావాలని స్పష్టం చేసింది. తదుపరి విచారణ వచ్చే నెల 9వ హైకోర్టు వాయిదా వేసింది.

## భారత్‌లో నాణ్యమైన మ్యానుఫాక్చరింగ్ వ్యవస్థ ఉంది

### -ప్రధాని నరేంద్ర మోడీ



హైదరాబాద్ నవంబర్ 27 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: భారత్ లో నాణ్యమైన మ్యానుఫాక్చరింగ్ వ్యవస్థ ఉందని ప్రధాని నరేంద్ర మోడీ తెలిపారు. భారత్ లో అంతరిక్షరంగం నిపుణులకు కొదవ లేదని అన్నారు. హైదరాబాద్ రావిర్యాలోని స్కైరూట్ ఇన్ఫినిటీ క్యాంపస్ ను వర్చువల్ గా ప్రధాని మోడీ ప్రారంభం చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. స్కైర్యూట్ బృందానికి అభినందనలు తెలియజేశారు. భారత్ అంతరిక్ష రంగంలో ఇది ఒక గొప్ప మైలు రాయి అని.. స్కైరూట్ విజయం భారత యువ శక్తికి స్ఫూర్తినిస్తుందని అన్నారు. భారత యువశక్తి నైపుణ్యానికి స్కైరూట్ గొప్ప ప్రతీక అని కొనియాడారు. సైకిల్ పై రాకెట్ మోసుకెళ్లిన స్థితి నుంచి మన ప్రస్థా నం ప్రారంభమైందని, భారత అంత రిక్ష రంగంలో భవిష్యత్తులో మరిన్ని ఘనతలు సాధిస్తుందని మోడీ పేర్కొన్నారు. వ్యవసాయం, వాతావ రణ అంచనాల్లో మరింత విజ్ఞానం సాధించాలని, భారత అంతరిక్ష రంగంలో ఎన్నో సంస్కరణలు అమలు చేస్తున్నామని అన్నారు. స్పేస్ సెక్టార్ లో కోఆపరేటివ్, ఎకో సిస్టమ్ ను తీసుకువచ్చామని, జన్ జీ అనుకున్నది సాధించేలా ప్రభు త్వం సహకరిస్తుందని అన్నారు. అంతరిక్ష రంగంలో ఇస్తున్న మద్దతు వల్లే స్టార్టప్‌లు వస్తున్నాయని, ప్రైవేటు రంగంలోనూ అంతరిక్ష సంస్థలు పుట్టుకొస్తున్నాయని మోడీ స్పష్టం చేశారు.

## బతుకమ్మ కుంట వివాదంలో హైకోర్టు విచారణకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ గైర్హాజర్

### -నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేస్తాం

### -హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు హైకోర్టు వార్నింగ్



హైదరాబాద్ నవంబర్ 27 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );హైదరాబాద్ బతుకమ్మ కుంట వివాదంలో హైకోర్టు విచారణకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ ప్రత్యక్షంగా హాజరుకాకపోవడంపై తెలంగాణ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రత్యక్షంగా కోర్టులో హాజరుకాకపోతే నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేయాల్సి ఉంటుందని హెచ్చరించింది. బతుకమ్మ కుంట వివాదంలో డిసెంబర్ 5వ తేదీ లోపు ప్రత్యక్షంగా వచ్చి కోర్టులో హాజరుకావాలని నోటీసులు జారీ చేసింది.బతుకమ్మ కుంట పరిధిలోని కోర్టు వివాదంలో ఉన్న ప్రైవేటు స్థలంలో ఎలాంటి మార్పులు చేర్పులు చేయరాదని జూన్ 12వ తేదీన హైకోర్టు ఉత్తర్వులను హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఉల్లంఘించారని ఆయనపై ఎ.సుధాకర్ రెడ్డి కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై గతంలో విచారణ చేపట్టిన హైకోర్టు.. కోర్టు ధిక్కరణ కింద ఎందుకు చర్యలు తీసుకురాదో వ్యక్తిగతంగా హాజరై వివరణ ఇవ్వాలంటూ రంగనాథ్‌కు నోటీసులు జారీ చేసింది. తాజాగా బుధవారం నాడు ఈ పిటిషన్‌పై విచారణ జరగ్గా.. రంగనాథ్ హాజరుకాకపోవడంపై హైకోర్టు అసహనం వ్యక్తం చే సింది. ప్రత్యక్షంగా కోర్టులో హాజరుకాకపోతే నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేస్తామని హెచ్చరించింది.బతుకమ్మ కుంటతో పాటు గతంలోనూ తమ ఆదేశాలను పాటించలేదని హైడ్రాపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. హైడ్రాకు వ్యతిరేకంగా రోజుకు 10 పిటిషన్ల వరకు వస్తున్నాయని పేర్కొంది. ప్రజలను బాధించేవి కాకుండా.. వారికి మంచి జరిగే పనులు చేయాలని ఆదేశించింది.

## పేలిన వాషింగ్ మిషన్.. ఉలిక్కిపడ్డ ప్రజలు

హైదరాబాద్, నవంబర్ 27:అమీర్‌పేట్‌లోని ఓ ఇంటి బాల్కనీలో గురువారం వాషింగ్ మిషన్ పేలింది. భారీ శబ్దంతో పేలడంతో.. వాషింగ్ మిషన్ తునాతునకలైపోయింది. ఈ పేలుడు సమయంలో బాల్కనీలో ఎవరూ లేకపోవడంతో.. భారీ ప్రాణ నష్టం తప్పినట్లు అయింది. వాషింగ్ మిషన్ రన్నింగ్‌లో ఉండగా ఈ పేలుడు సంభవించింది. ఈ పేలుడు దాటికి తామంతా భయభ్రాంతులకు ఆ ఇంటి యజమాని వెల్లడించారు. తమ కుటుంబంలోని ఎవరైనా బాల్కనీలో ఉండి ఉంటే పెద్ద ప్రమాదమే జరిగేదన్నారు. ఈ పేలుడు ధాటికి వాషింగ్ మిషన్ లోపలి భాగాలు ఎగిరిపడ్డాయని వివరించారు.

సీలింగ్ తగిలి వాషింగ్ మిషన్ భాగాలు కింద పడ్డాయని తెలిపారు. అయితే వాషింగ్ మిషన్ పేలుడుకి గల కారణాలు తెలియాల్సి ఉంది. మిషన్ తయారీలో లోపమా.. లేకుంటే మెయింటెనెన్స్ సరిగ్గా లేకపోవడం వల్ల పేలిందా.. అన్నది కనుగొనాల్సి ఉంది. ఈ ఘటనపై వాషింగ్ మిషన్ సంస్థకు ఫిర్యాదు చేశామని ఇంటి యజమాని చెప్పారు. ఇక ఈ భారీ పేలుడుతో ఆ పరిసర ప్రాంతాల్లోని ఇళ్లల్లోని ప్రజలు భయంతో బయటకు పరుగు తీశారు. ఈ ఘటనలో ఎవరికి ఎటువంటి గాయాలు కాలేదు. దాంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

# అంగారక గ్రహ స్వరూప స్వభావాల గుట్టు విప్పుతూ?!

## (28 నవంబర్ "రెడ్ ప్లానెట్ దినోత్సవం" సందర్భంగా)

మినియన్ ఏండ్లుగా రాత్రిపూట ఆకాశంలో మెరుస్తున్న సౌర కుటుంబంలోని నాల్గవ గ్రహం అయిన అంగారకుడిని ఎర్రని రంగును మానవ నేత్రంతో చూస్తున్నాం, అబ్బురపడుతున్నాం. దీనికి ఉన్న రంగు కారణంగా అంగారక గ్రహాన్ని రెడ్ ప్లానెట్ అని పిలుస్తున్నాం. భూమి వాతావరణం కారణంగా నీలి రంగులో కనిపిస్తే, అంగారక గ్రహం ఉపరితలంపై ఫెర్రిక్ ఆక్సైడ్ ఉండడంతో ఎర్రటి రంగు కనిపిస్తున్నది. రోమన్ యుద్ధ దేవుడి పేరు మీద ఉన్న మార్స్, సౌర కుటుంబంలో ఉన్న 4వ అతి పెద్ద గ్రహంగా, భూమిని పోలి ఉంటుంది. అనేక దేశాలు అంతరిక్ష నౌకలను అంగారకుడి వద్దకు పంపించి అన్వేషణలు కొనసాగిస్తూ, 2030 నాటికి మానవులను సహితం పంపేందుకు ప్రయత్నాలు జోరుగా జరుగుతున్నాయి. భూమికి 34 మిలియన్ల మైళ్ల దూరంలో ఉన్న అంగారకుడి ఉపరితలంపై -191 నుంచి -80 డిగ్రీల ఫారన్‌హీట్ ఉష్ణోగ్రత నమోదు అవుతూ, ఆ వాతావరణంలో కార్బన్ డై ఆక్సైడ్ అధికంగా ఉన్నట్లు తెలుస్తున్నది.

### అంగారకుడి అన్వేషణ లకు పునాది వేసిన మారినర్ 4 మిషన్:

3 - 4 బిలియన్ ఏండ్ల క్రితం ఏర్పడిన అంగారక (మార్స్) గ్రహం పట్ల పూర్తి శాస్త్రీయా అవగాహన కలిపించడానికి ప్రతి ఏట 28 నవంబర్ రోజు "ఎర్రటి గ్రహ దినోత్సవం (రెడ్ ప్లానెట్ డే)" పాటించుట ఆనవాయితీగా మారింది. 28 నవంబర్ 1964 రోజు అంగారక గ్రహం వైపు నాసా ప్రయోగించిన అంతరిక్ష నౌక "మారినర్ 4 మిషన్"కు గుర్తుగా ప్రతి ఏట 28 నవంబర్ రోజు రెడ్ ప్లానెట్ డే జరుపుకుంటున్నాం. ఈ నౌక 14 జూలై 1965న అంగారక గ్రహానికి 985 కిమీ సమీపానికి చేరుకుంది. ఈ ప్రయోగం ద్వారా అంగారక గ్రహం సమీపం నుంచి 22 క్లోజప్ ఫోటోలు తీయడం, ముఖ్యమైన వివరాలను పంపించడం జరిగింది. నాటి నుంచి నేటి వరకు అనేక అన్వేషణాత్మక మిషన్లు అంగారక గ్రహానికి పంపడం, విషయ సేకరణ చేయడం కొనసాగుతున్నది. ప్రస్తుతం అంగారక గ్రహం చుట్టు ఐదు అంతరిక్ష నౌకలు భ్రమిస్తున్నాయి, రెండు నౌకలు ఉపరితలంపై ఉన్నాయి. ఈ నౌకల నుంచి అమూల్యమైన సమాచారం అందుతోంది. భూమి పరిమాణంలో సగం మాత్రమే ఉన్న అంగారక గ్రహంపై అత్యంత ఎత్తైన పర్వతం ఉన్నట్లు తేలింది.

భారతదేశ ఇస్రో కూడా మంగళ్యాన్-1 అంతరిక్ష మిషన్‌ను ప్రయోగించడం జరిగింది. రెడ్ ప్లానెట్ డే వేదికగా పలు అంతరిక్ష ప్రయోగాలకు సంబంధించిన ఫిలిమ్‌లు చూడడం, రాత్రి వేళల్లో రెడ్ ప్లానెట్‌ను చూసి ఆనందించడం, వీడియోలు వీక్షించడం, విద్యార్థులు సౌర కుటుంబ నమూనాలను తయారు చేయడం, అంతరిక్ష నౌక మారినర్ 4 మిషన్ పట్ల అవగాహన పొందడం లాంటి కార్యక్రమాలను నిర్వహించవచ్చు. నవ గ్రహాల్లో ఒకటైన భూమిపై నివసిస్తున్న నరుడు ఇతర గ్రహాలపై చేరుకోవడానికి విశ్వ ప్రయత్నాలు చేస్తున్నాడు, కొంత వరకు సఫలీకృతం అవుతున్నాడు. అంగారకుడి ఆత్మను శోధించి, మానవ ఆవాసానికి అనువైన మరో గ్రాహంగా అంగారకుడిపై కాలు మోపుదాం, అద్భుత అంతరిక్ష ఆవిష్కరణలకు పునాదులు వేద్దాం.

-ఆచార్య బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# గురు సాహిబ్ జీవితం, త్యాగం, వ్యక్తిత్వం స్ఫూర్తిదాయకం

న్యూఢిల్లీ, నవంబర్ 27: హర్యానాలోని కురుక్షేత్రలో ఈ రోజు శ్రీ గురు తేజ్ బహదూర్ జీ 350వ షహీదీ దివస్‌ను పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రసంగించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి మాట్లాడుతూ... ఈ రోజు భారత వారసత్వ అద్భుత సంగమ దినమని అని వ్యాఖ్యానించారు. ఉదయం తాను రామాయణ నగరమైన అయోధ్యలో ఉన్నాననీ... ఇప్పుడు తాను గీతా నగరమైన కురుక్షేత్రలో ఉన్నానని ఆయన పేర్కొన్నారు. శ్రీ గురు తేజ్ బహదూర్ జీ 350వ వర్ధంతి సందర్భంగా ఆయనకు నివాళులు అర్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సాధువులు, సంబంధిత సమాజం హాజరైనట్లు పేర్కొన్న ప్రధానమంత్రి... అందరికీ తన గౌరవప్రదమైన నమస్కారాలు తెలిపారు.

5-6 సంవత్సరాల కిందటే మరో అద్భుతమైన యాదృచ్ఛికం జరిగిందని గుర్తుచేసుకుంటూ... 2019 నవంబర్ 9న సుప్రీం కోర్టు రామమందిరం విషయంలో తీర్పు వెలువరించిన సమయంలో తాను దేరా బాబా నానక్‌లో కర్తార్‌పూర్ కారిడార్ ప్రారంభోత్సవంలో ఉన్నానని శ్రీ మోదీ తెలిపారు. ఆ రోజు రామమందిర నిర్మాణ మార్గం సుగమం కావాలనీ, కోట్లాది మంది రామభక్తుల ఆకాంక్షలు నెరవేరాలని తాను ప్రార్థించినట్లు ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. అదే రోజున రామమందిరానికి అనుకూలంగా తీర్పు వెలువడటంతో అందరి ప్రార్థనలకు ఫలితం లభించిందని ఆయన పేర్కొన్నారు. అయోధ్యలో ధర్మ ధ్వజ స్థాపన జరిగిన నేటి సందర్భంలో సిక్కు సంఘ్ నుంచీ ఆశీర్వాదం పొందే అవకాశం తనకు మరోసారి లభించిందని ప్రధానమంత్రి పేర్కొన్నారు.

కొద్దిసేపటి కిందటే కురుక్షేత్ర భూమిపై 'పాంచజన్య స్మారక చిహ్నం' ప్రారంభించినట్లు శ్రీ మోదీ పేర్కొన్నారు. ఈ నేలపైనే సత్యం, న్యాయాన్ని కాపాడటం అత్యున్నత కర్తవ్యంగా శ్రీ కృష్ణుడు ప్రకటించారని ఆయన తెలిపారు. కృష్ణుడి మాటలను పఠిస్తూ సత్య మార్గం కోసం, తన విధి నిర్వర్తించడం కోసం జీవితాన్ని అంకితం చేయడం అత్యున్నతమని శ్రీ మోదీ అన్నారు. శ్రీ గురు తేజ్ బహదూర్ జీ కూడా సత్యం, న్యాయం, విశ్వాసాన్ని రక్షించడమే తన ధర్మంగా భావించారనీ... ఆయన తన జీవితాన్ని త్యాగం చేయడం ద్వారా ఈ ధర్మాన్ని నిలబెట్టారని ఆయన వ్యాఖ్యానించారు. ఈ చరిత్రాత్మక సందర్భంలో శ్రీ గురు తేజ్ బహదూర్ జీ పాదాల వద్ద ఒక స్మారక పోస్టల్ స్టాంపు, ప్రత్యేక నాణెంను విడుదల చేసే అవకాశం భారత ప్రభుత్వానికి లభించిందన్నారు. ప్రభుత్వం ఈ విధంగా గురు సంప్రదాయానికి సేవ చేయడం కొనసాగిస్తుందని ప్రధానమంత్రి ఆకాంక్షించారు.

కురుక్షేత్ర పవిత్ర భూమి సిక్కు సంప్రదాయానికి ప్రధాన కేంద్రమని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. సిక్కు సంప్రదాయానికి చెందిన దాదాపు అందరు గురువులు తమ పవిత్ర యాత్రల్లో భాగంగా ఈ భూమిని సందర్శించారని ఆయన గుర్తు చేశారు. తొమ్మిదో గురువు శ్రీ గురు తేజ్ బహదూర్ జీ ఈ పవిత్ర నేలకు వచ్చినప్పుడు తన లోతైన ధ్యానం, అసమాన ధైర్యంతో చెరగని ముద్ర వేశారని ఆయన గుర్తు చేసుకున్నారు.

"శ్రీ గురు తేజ్ బహదూర్ జీ వంటి వ్యక్తులు చరిత్రలో చాలా అరుదు. ఆయన జీవితం, త్యాగం, వ్యక్తిత్వం స్ఫూర్తిదాయకం" అని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు. మొఘల్ దండయాత్రల కాలంలో గురు సాహిబ్ తన ధైర్యసాహసాలతో ఆదర్శంగా నిలిచారని ఆయన తెలిపారు. శ్రీ గురు తేజ్ బహదూర్ జీ బలిదానానికి ముందు... మొఘల్ దురాక్రమణదారులు కాశ్మీరీ హిందువులను బలవంతంగా ఇస్లాంలోకి మార్చారని ప్రధానమంత్రి తెలిపారు. ఈ సంక్షోభ సమయంలో దురాక్రమణదారుల బృందం గురు సాహిబ్ మద్దతు కోరిందన్నారు. తాను స్వయంగా ఇస్లాంను స్వీకరించడం సాధ్యమైతే, మిగిలిన వారు కొత్త మతాన్ని స్వీకరించే అవకాశం సాధ్యం అవుతుందంటూ ఔరంగజేబుకు స్పష్టంగా గురు సాహిబ్ సందేశం పంపినట్లు ప్రధానమంత్రి గుర్తు చేశారు.

శ్రీ గురు తేజ్ బహదూర్ జీ ధైర్యాన్ని ఈ మాటలు ప్రతిబింబిస్తున్నాయని శ్రీ మోదీ పేర్కొన్నారు. భయపడినట్లే క్రూరుడైన ఔరంగజేబు గురు సాహిబ్‌ను ఖైదీగా తీసుకురమ్మని ఆదేశించారు. అయితే గురు సాహిబ్ స్వయంగా ఢిల్లీకి వెళ్లాలని నిర్ణయించుకున్నారన్నారు. మొఘల్ పాలకులు తనను ప్రలోభాలతో ఆకర్షించడానికి ప్రయత్నించినప్పటికీ శ్రీ గురు తేజ్ బహదూర్ దృఢంగా ఉండి తన విశ్వాసం, సూత్రాల విషయంలో రాజీ పడటానికి నిరాకరించారని ప్రధానమంత్రి తెలిపారు. తన దృఢ సంకల్పాన్ని విచ్ఛిన్నం చేయడానికి, తన మార్గం నుంచి తనను మళ్లించడానికి, మొఘలులు తన ముగ్గురు సహచరులైన భాయ్ దయాళ్ జీ, భాయ్ సతీ దాస్ జీ, భాయ్ మతి దాస్ జీ లను ఆయన కళ్ళ ముందే దారుణంగా ఉరితీశారని ఆయన పేర్కొన్నారు. అయినప్పటికీ గురు సాహిబ్ అచంచలంగా, తన సంకల్పం విచ్ఛిన్నం కాకుండా ధృడంగా నిలిచారని ప్రధానమంత్రి అన్నారు. గురు సాహిబ్ ధర్మ మార్గాన్ని విడిచిపెట్టలేదనీ, తన విశ్వాసాన్ని కాపాడుకోవడానికి లోతైన ధ్యాన స్థితిలో తన తలనూ త్యాగం చేశారని శ్రీ మోదీ వివరించారు.

గురు మహారాజ్ పవిత్ర శిరస్సును అవమానించడానికి మొఘలులు ప్రయత్నించినప్పటికీ... భాయ్ జైతా జీ తన పరాక్రమంతో గురువు తలను ఆనంద్‌పూర్ సాహిబ్‌కు మోసుకెళ్లారని ఆయన తెలిపారు. శ్రీ గురు గోవింద్ సింగ్ జీ మాటలను ప్రధానమంత్రి గుర్తు చేసుకున్నారు. విశ్వాసపు పవిత్ర తిలకాన్ని రక్షించారు... ప్రజల విశ్వాసాల్ని కూడా రక్షించారు. దీని కోసం గురు సాహిబ్ అన్నింటినీ త్యాగం చేశారని చెప్పారు.

గురు సాహిబ్ త్యాగం జరిగిన ఈ భూమి నేడు ఢిల్లీ సిస్ గంజ్ గురుద్వారాగా, స్ఫూర్తిదాయకమైన ప్రదేశంగా ఉందని శ్రీ మోదీ పేర్కొన్నారు. ఆనంద్‌పూర్ సాహిబ్ తీర్థయాత్ర మన జాతీయ చైతన్యానికి శక్తి కేంద్రమని ఆయన వ్యాఖ్యానించారు. నేటికీ నిలిచి ఉన్న భారత స్వరూపం గురు సాహిబ్ వంటి యుగపురుషుల త్యాగం, అంకితభావాన్ని ప్రతిబింబిస్తుందని ప్రధానమంత్రి పేర్కొన్నారు. ఈ అత్యున్నత త్యాగం కారణంగానే శ్రీ గురు తేజ్ బహదూర్ సాహిబ్‌ను 'హింద్ ది చాదర్'గా గౌరవిస్తున్నారని ఆయన తెలిపారు.

మన గురువుల సాంప్రదాయమే దేశ స్వభావం, సంస్కృతి, ప్రధాన స్ఫూర్తికి పునాది వేస్తుంది" అని శ్రీ మోదీ తెలిపారు. గత 11 సంవత్సరాల్లో ప్రభుత్వం ఈ పవిత్ర సంప్రదాయాలను, ప్రతి సిక్కు వేడుకను జాతీయ పండగలుగా ప్రకటించిందన్నారు. శ్రీ గురు నానక్ దేవ్ జీ 550వ ప్రకాష్ పర్వ్, శ్రీ గురు తేజ్ బహదూర్ సాహిబ్ జీ 400వ ప్రకాష్ పర్వ్, శ్రీ గురు గోవింద్ సింగ్ జీ 350వ ప్రకాష్ పర్వ్‌లను భారత ఐక్యత, సమగ్రతల పండగలుగా జరుపుకొనే అవకాశం తమ ప్రభుత్వానికి లభించిందని ప్రధానమంత్రి పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ప్రజలు తమ విశ్వాసాలు, సంప్రదాయాలు, నమ్మకాలకు అతీతంగా ఈ వేడుకల్లో పాల్గొన్నారని ఆయన పేర్కొన్నారు.

గురువులతో ముడిపడి ఉన్న పవిత్ర స్థలాలకు అత్యంత అద్భుతమైన, దివ్యమైన రూపాన్ని ఇచ్చే అదృష్టం తమ ప్రభుత్వానికి కలిగిందని స్పష్టం చేసిన శ్రీ మోదీ... గత దశాబ్దంలో గురు సంప్రదాయంతో ముడిపడి ఉన్న కార్యక్రమాల్లో తానూ స్వయంగా పాల్గొన్న సందర్భాలు చాలా ఉన్నాయని ఆయన తెలిపారు. కొంతకాలం కిందటే గురు గ్రంథ్ సాహిబ్ మూడు మూల రూపాలు ఆఫ్ఘనిస్తాన్ నుంచి భారత్‌కు వచ్చిన సందర్భం ప్రతి పౌరుడికి గర్వకారణంగా మారిందని ప్రధానమంత్రి గుర్తు చేసుకున్నారు.

గురువుల ప్రతి తీర్థయాత్ర స్థలాన్ని ఆధునిక భారత దార్శనికతతో అనుసంధానించడానికి ప్రభుత్వం ప్రయత్నించిందని శ్రీ మోదీ తెలిపారు. కర్తార్‌పూర్ కారిడార్ పనులను పూర్తి చేయడం, హేమకుండ్ సాహిబ్‌లో రోప్‌వే ప్రాజెక్టును నిర్మించడం, ఆనంద్‌పూర్ సాహిబ్‌లోని విరాసత్-ఎ-ఖల్సా మ్యూజియంను విస్తరించడం వంటి పనులన్నింటినీ సంపూర్ణ భక్తి భావంతో చేపట్టామనీ, గురువుల అద్భుతమైన సంప్రదాయాన్ని మార్గదర్శక ఆదర్శంగా ఉంచుతున్నామని శ్రీ మోదీ పేర్కొన్నారు.

ధైర్యవంతులైన సాహిబ్‌జాదాలతోనూ మొఘలులు అత్యంత క్రూరంగా వ్యవహరించిన విషయం అందరికీ తెలుసని ప్రధానమంత్రి తెలిపారు. ఇటుకలతో కొట్టినా వారి విధిని, విశ్వాస మార్గాన్ని సాహిబ్‌జాదాలు విడిచిపెట్టలేదని ఆయన పేర్కొన్నారు. ఈ ఆదర్శాల గౌరవార్థం ప్రతి సంవత్సరం డిసెంబర్ 26న వీర్ బల్ దివస్‌ను పాటిస్తున్నామని ప్రధానమంత్రి పేర్కొన్నారు. సేవ, ధైర్యం, సత్యంల ఆదర్శాలు కొత్త తరం ఆలోచనలకు పునాదిగా మారేలా ప్రభుత్వం సిక్కు సాంప్రదాయ చరిత్రను, గురువుల బోధనలను జాతీయ పాఠ్యాంశాల్లో చేర్చిందని ఆయన స్పష్టం చేశారు.'జోడా సాహిబ్' పవిత్ర దర్శనాన్ని అందరూ తప్పకుండా పొంది ఉంటారని ప్రధానమంత్రి విశ్వాసం వ్యక్తం చేశారు. తన మంత్రివర్గ సహచరులు, కేంద్ర మంత్రి శ్రీ హర్దీప్ సింగ్ పురీ ఈ పవిత్ర పాదుకల గురించి తనతో మొదటిసారి చర్చించినప్పుడు... ఆయన కుటుంబం గురు గోవింద్ సింగ్ జీ, మాతా సాహిబ్ కౌర్ జీ పవిత్ర 'జోడా సాహిబ్'ను దాదాపు మూడు వందల సంవత్సరాలుగా సంరక్షిస్తూ వచ్చిందని ఆయన చెప్పినట్లు శ్రీ మోదీ తెలిపారు. ఈ పవిత్ర వారసత్వాన్ని ఇప్పుడు దేశవిదేశాల్లోని సిక్కు సమాజానికి అంకితం చేస్తున్నామని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు. ఆ తర్వాత పవిత్ర 'జోడా సాహిబ్'ను పూర్తి గౌరవ మర్యాదలతో శాస్త్రీయంగా పరీక్షించినట్లు ఆయన వివరించారు. తద్వారా దానిని భవిష్యత్ తరాల కోసం పరిరక్షించవచ్చని శ్రీ మోదీ తెలిపారు. అన్ని వాస్తవాలను పరిగణనలోకి తీసుకుని, పవిత్ర 'జోడా సాహిబ్'ను గురు మహారాజ్ తన బాల్యంలో ఎక్కువ సమయం గడిపిన తఖ్త్ శ్రీ పాట్నా సాహిబ్‌కు అంకితం చేయాలని సమష్టి నిర్ణయం తీసుకున్నట్లు ప్రధానమంత్రి తెలిపారు. గత నెలలో ఈ పవిత్ర ప్రయాణంలో భాగంగా పవిత్ర 'జోడా సాహిబ్'ను ఢిల్లీ నుంచి పాట్నా సాహిబ్‌కు తరలిస్తున్న సందర్భంలో తనకు ఆ దివ్య పాదుకల ముందు తల వంచి నమస్కరించే అవకాశం లభించిందని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. ఈ పవిత్ర వారసత్వంతో సేవ, అంకితభావం, అనుసంధానానికి అవకాశం లభించడం గురువుల ప్రత్యేక కృపగా ఆయన భావించారు.

శ్రీ గురు తేజ్ బహదూర్ సాహిబ్ జీ జ్ఞాపకాలు భారత సంస్కృతి ఎంత విశాలంగా, ఉదారంగా, మానవత్వ కేంద్రంగా ఉందో మనకు బోధిస్తున్నాయని శ్రీ మోదీ గుర్తుచేసుకున్నారు. గురు సాహిబ్ తన జీవితం ద్వారా సర్బత్ ద భలా మంత్రాన్ని ఉపదేశించారని ఆయన తెలిపారు. ఈ జ్ఞాపకాలను, పాఠాలను గౌరవించుకోవడానికి ఈ కార్యక్రమం ఒక సందర్భం మాత్రమే... కానీ మన వర్తమానం, భవిష్యత్తుకు ఒక ముఖ్యమైన ప్రేరణగా ఇది నిలుస్తుందని ప్రధానమంత్రి పేర్కొన్నారు. ప్రతికూల పరిస్థితుల్లోనూ దృఢంగా ఉండేవారే నిజమైన జ్ఞాని... నిజమైన అన్వేషకుడు అనే గురు సాహిబ్ బోధనను ఆయన గుర్తు చేసుకున్నారు. ఈ స్ఫూర్తితో మనం ప్రతి సవాలును అధిగమించి మన దేశాన్ని ముందుకు తీసుకెళ్లాలనీ, దేశాన్ని అభివృద్ధి చేయాలనీ ప్రధానమంత్రి పిలుపునిచ్చారు. గురు సాహిబ్ ఎవరినీ భయపెట్టకూడదనీ, ఎవరికీ భయపడకూడదని మనకు బోధించారని ఆయన పేర్కొన్నారు. ఈ నిర్భయత సమాజాన్నీ, దేశాన్ని బలపరుస్తుందనీ, భారత్ ప్రస్తుతం ఈ సూత్రం ఆధారంగా ముందుకు సాగుతోందని ఆయన వ్యాఖ్యానించారు. భారత్ తన సరిహద్దులను కాపాడుకుంటూనే ప్రపంచానికి సోదరభావం గురించి బోధిస్తోందని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. భారత్ శాంతిని కోరుకుంటున్నప్పటికీ దేశ భద్రత విషయంలో ఎప్పుడూ రాజీపడదని, ఆపరేషన్ సిందూర్ దీనికి గొప్ప ఉదాహరణ అని ఆయన పేర్కొన్నారు. నూతన భారత్ ఉగ్రవాదానికి భయపడదు, ఆగదు, తలవంచదు అనే విషయాన్ని ప్రపంచం మొత్తం చూసిందని శ్రీ మోదీ ధ్రువీకరించారు. భారత్ ప్రస్తుతం పూర్తి బలం, ధైర్యం, స్పష్టతతో ముందుకు సాగుతోందని ఆయన అన్నారు.

ఈ ముఖ్యమైన సందర్భంలో తాను సమాజానికి, యువతకు సంబంధించిన ఒక అంశంపై మాట్లాడాలనుకుంటున్నానని ప్రధానమంత్రి పేర్కొన్నారు. ఇది గురు సాహిబ్‌కు కూడా ఆందోళన కలిగించే విషయమేమనని... మాదకద్రవ్యాల వ్యసనం అనే సమస్య గురించే తాను చెబుతున్నానని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. ఈ వ్యసనం చాలా మంది యువకుల కలలను లోతైన సవాళ్లలోకి నెట్టివేస్తుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యను దాని మూలాల నుంచి పూర్తిగా నిర్మూలించడానికి ప్రభుత్వం అన్ని ప్రయత్నాలూ చేస్తోందని ప్రధానమంత్రి తెలిపారు. అయితే ఇది సమాజం, బాధిత కుటుంబాలూ చేయాల్సిన యుద్ధమని ఆయన స్పష్టం చేశారు. ఇటువంటి సమయంలో శ్రీ గురు తేజ్ బహదూర్ సాహిబ్ బోధనలు సానుకూల ప్రేరణగా, పరిష్కారంగా పనిచేస్తాయని ఆయన వ్యాఖ్యానించారు. గురు సాహిబ్ ఆనంద్‌పూర్ సాహిబ్ నుంచి తన ప్రయాణాన్ని ప్రారంభించినప్పుడు ఆయన అనేక గ్రామాలను సంగత్‌తో అనుసంధానించారనీ... వారి భక్తి, విశ్వాసాన్ని విస్తరించారని... సమాజ ప్రవర్తననూ మార్చారని ప్రధానమంత్రి గుర్తు చేసుకున్నారు. ఈ గ్రామాల ప్రజలు అన్ని రకాల మత్తు పదార్థాల సాగును విడిచిపెట్టి, తమ భవిష్యత్తును గురు సాహిబ్ పాదాలకు అంకితం చేశారని ఆయన వ్యాఖ్యానించారు. గురు మహారాజ్ చూపిన మార్గాన్ని అనుసరించడం ద్వారా సమాజం, కుటుంబాలు, యువత ఐక్యంగా వ్యసనానికి వ్యతిరేకంగా నిర్ణయాత్మక యుద్ధం చేస్తే... ఈ సమస్యను దాని మూలాల నుంచి నిర్మూలించవచ్చని శ్రీ మోదీ స్పష్టం చేశారు.

శ్రీ గురు తేజ్ బహదూర్ సాహిబ్ బోధనలు మన ప్రవర్తనలో శాంతికి, మన విధానాల్లో సమతుల్యతకు, మన సమాజంపై నమ్మకానికి పునాది కావాలని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. ఇదే ఈ సందర్భ సారాంశమన్నారు. శ్రీ గురు తేజ్ బహదూర్ బలిదాన దినోత్సవాన్ని దేశవ్యాప్తంగా జరుపుకుంటున్న విధానం నేటికీ సమాజ స్మృహలో గురువుల బోధనలు ఎంత సజీవంగా ఉన్నదీ కనిపిస్తోందని ఆయన పేర్కొన్నారు. ఈ స్ఫూర్తితోనే ఈ వేడుకలు యువత దేశాన్ని ముందుకు తీసుకెళ్లడానికి అర్థవంతమైన ప్రేరణగా పనిచేయాలని ప్రధానమంత్రి పేర్కొంటూ... అందరికీ మరోసారి తన శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో హర్యానా గవర్నర్ ప్రొఫెసర్ అశిమ్ కుమార్ ఘోష్, హర్యానా ముఖ్యమంత్రి శ్రీ నాయబ్ సింగ్ సైని, కేంద్ర మంత్రులు శ్రీ మనోహర్ లాల్, శ్రీ రావు ఇంద్రజిత్ సింగ్, శ్రీ కృష్ణ పాల్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణుని పవిత్ర శంఖం గౌరవార్థం కొత్తగా నిర్మించిన 'పాంచజన్య'ను ప్రధానమంత్రి ప్రారంభించారు. ఆ తర్వాత ఆయన మహాభారత అనుభవ కేంద్రాన్ని సందర్శించారు. ఇది మహాభారతంలోని ముఖ్యమైన ఘట్టాలను చిత్రీకరించే... దాని శాశ్వత సాంస్కృతిక, ఆధ్యాత్మిక ప్రాముఖ్యతను స్పష్టం చేసే అద్భుత అనుభవాలను అందించే కేంద్రం.

తొమ్మిదో సిక్కు గురువు శ్రీ గురు తేజ్ బహదూర్ జీ 350వ షహీదీ దివస్‌ను స్మరించుకునే ప్రత్యేక కార్యక్రమంలో ప్రధానమంత్రి పాల్గొన్నారు.

# తాగునీరు, సైన్‌బోర్డులు అందుబాటులో ఉంచాలి

## -శ్రీకాళహస్తి రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు సమీక్షించిన ఎంపీ గురుమూర్తి



తిరుపతి, నవంబర్ 27:శ్రీకాళహస్తి రైల్వే స్టేషన్‌లో రూ.50 కోట్లతో జరుగుతున్న అభివృద్ధి పనులను తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి గురువారం పరిశీలించారు. స్టేషన్‌లో మొదటి దశలో జరుగుతున్న పనుల పురోగతిని ఆయన తనిఖీ చేశారు. పాత ఎల్‌సీ గేట్ నెం. 28 వద్ద అండర్‌పాస్ మూసివేయడంతో అక్కడ అండర్ బ్రిడ్జ్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరగా, వారి అభ్యర్థనను రైల్వే అధికారుల దృష్టికి తీసుకెళ్లి సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తామని ఎంపీ హామీ ఇచ్చారు. స్టేషన్‌లో తాగునీటి వసతి, సైన్‌బోర్డులు, ఇతర మౌలిక వసతులపై ఎంపీ ప్రత్యేకంగా ఆరా తీశారు. తాగునీరు సక్రమంగా అందుబాటులో ఉండేలా చూడాలని, స్టేషన్‌లో సైన్‌బోర్డులు సరిగా లేవని గమనించి వెంటనే ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

శ్రీకాళహస్తి ఆలయ ఈఓతో మాట్లాడిన ఎంపీ, రైల్వే స్టేషన్‌లో ఉన్న సమాచార కేంద్రంలో భక్తులకు 24 గంటలు సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ఆలయ సేవలకు సంబంధించిన వివరాలను రైల్వే స్టేషన్ ఆవరణలో ఒక డిజిటల్ బోర్డు ద్వారా ప్రదర్శించేలా వెంటనే ఏర్పాట్లు చేయాలని సూచించారు. శ్రీకాళహస్తి రైల్వే స్టేషన్ ద్వారా గతంలో నడుస్తున్న గుంటూరు-తిరుపతి ప్యాసింజర్, గూడూరు-తిరుపతి ప్యాసింజర్, చెన్నై-రేణిగుంట-నెల్లూరు మెమూ ప్యాసింజర్ వంటి రైళ్లు కోవిడ్ అనంతరం నిలిపివేశారని స్థానిక నాయకులు, ప్రయాణికులు ఎంపీకి విన్నవించారు. ప్రస్తుతం రేణిగుంట-గూడూరు, గూడూరు-రేణిగుంట ప్యాసింజర్ రైళ్లు మాత్రమే నడుస్తున్నందున నిలిపివేసిన ప్యాసింజర్ రైళ్ల పునరుద్ధరణ కోసం చర్యలు తీసుకోవాలని వారు కోరారు. శ్రీకాళహస్తి రైల్వే స్టేషన్ మొదటి దశ అభివృద్ధి పనులు మే 26 నాటికి పూర్తికానున్నాయని స్టేషన్ మాస్టర్ ఈ సందర్భంగా ఎంపీకి తెలిపారు. శ్రీకాళహస్తి రైల్వే స్టేషన్ అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తామని ఎంపీ గురుమూర్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


# ఎన్నికల హామీను నిలబెట్టారు

తుగ్గలి, నవంబర్ 27:మండలంలోని మారెళ్ళ- బొందిమడుగుల గ్రామాల మధ్య కృంగిపోయిన బ్రిడ్జిను నిర్మిస్తానని ఎన్నికల సమయంలో అప్పటి టీడీపి అభ్యర్థి, ప్రస్తుత ఎమ్మెల్యే కె ఈ శ్యామ్ కుమార్ ఇచ్చిన హామీ మేరకు ఇప్పుడు బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి చేయించి ఎన్నికల హామీను నిలబెట్టారని టీడీపి మండల కన్వీనర్ తిరుపాల్ నాయుడు, సర్పంచ్ సలహాదారుడు ప్రతాప్ యాదవ్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ మోహన్ తదితరులు పేర్కొన్నారు. గురువారం వారు పూర్తయిన బ్రిడ్జిని పరిశీలించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత వైకాపా ప్రభుత్వంలో బ్రిడ్జి నిర్మించాలని ఎన్నిసార్లు ప్రజలు కోరినప్పటికీ ఆ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. దీంతో ఎన్నికల పూర్తయిన వెంటనే ఎమ్మెల్యే కె ఈ శ్యామ్ కుమార్ ప్రత్యేక చొరవ తీసుకొని బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి చేయించాలని వారు తెలిపారు.


ఆహ్వానం

ఉదయ సాహితి తెలంగాణ



7
డిసెంబర్ 2025
ఆదివారం
ఉ॥ 9.30 గంటలకు

వేదిక :
ఎన్.టి.ఆర్. ఆడిటోరియం,
సురవరం ప్రతాపరెడ్డి
తెలుగు విశ్వవిద్యాలయం,
నాంపల్లి, హైదరాబాద్.



అందరూ ఆహ్వానితులే !

ఉదయ సాహితి - తెలంగాణ

ప్రముఖ కవి, రచయిత, విమర్శకులు శ్రీ దాస్యం సేనాధిపతి గారి
70వ జన్మదినోత్సవ సందర్భంగా వెలువరించిన
అక్షర గీతం (సప్తతి సంచిక)
ఆవిష్కరణ సభ

ముఖ్య అతిథి : శ్రీ సి.హెచ్. విద్యాసాగర్ రావు గారు
మహారాష్ట్ర పూర్వ గవర్నర్

గ్రంథావిష్కర్త : డా. కె.వి. రమణాచారి గారు, ఐ.ఏ.ఎస్. రిటైర్డ్
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారులు

సభాధ్యక్షులు : డా. సుద్దాల అశోక్‌తేజ గారు, ప్రముఖ కవి,
జాతీయ ఉత్తమ సినీ గేయ పురస్కార గ్రహీత

సభా ప్రారంభకులు : శ్రీ అమర్‌సింగ్ తిలావత్ గారు - (దాస్యం బాల్యమిత్రులు)
ఉమ్మడి ఆం.ప్ర రాష్ట్ర మాజీ మంత్రివర్యులు

ప్రార్థనా గీతం : శ్రీమతి సావిత్రి రంజోల్కర్ గారు - నవీ ముంబై
సంపాదకులు-అక్షర గీతం

అక్షర గీతం నేపథ్య వివరణ : శ్రీ శ్రీదాస్యం లక్ష్మయ్య గారు
రాష్ట్ర అధ్యక్షులు, ఉదయ సాహితి, తెలంగాణ
ప్రధాన సంపాదకులు, అక్షర గీతం

విశిష్ట అతిథులు : డా. ఏనుగు నరసింహారెడ్డి గారు
సంచాలకులు, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ
డా. నలిమెల భాస్కర్ గారు
బహుభాషావేత్త, కేంద్ర సాహిత్య అకాడమీ అనువాద అవార్డు గ్రహీత, కరీంనగర్.
శ్రీ జి.వి. శ్యామ్ ప్రసాద్ లాల్ గారు, జాయింట్ సెక్రటరీ,
మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల విద్యాలయాలు, తెలంగాణ

గౌరవ అతిథులు : డా. అమ్మంగి వేణుగోపాల్ గారు
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ తొలి కాళోజీ పురస్కార గ్రహీత
డా. నామోజు బాలాచారి గారు
కార్యదర్శి, తెలంగాణ సాహిత్య అకాడమి
శ్రీ బైస దేవదాస్ గారు, సంపాదకులు, నేటి నిజం

ఆత్మీయ అతిథులు - అభినందన సందేశాలు :
ఆచార్య మసన చెన్నప్ప గారు, ప్రముఖ సాహితీవేత్త
శ్రీ మౌనశ్రీ మల్లిక్ గారు, ప్రముఖ కవి, ఉత్తమ సినీ గేయ రచయిత
శ్రీ సరికొండ కోటంరాజు గారు, శ్రీ సరస్వతీ విద్యాపీఠం, సీనియర్ కార్యకర్త
డా. దాస్యం విజయ కుమార్, ప్రముఖ వైద్యులు, (దాస్యం సోదరులు)-నిర్మల్.
శ్రీమతి అయినంపూడి శ్రీలక్ష్మి గారు, అక్షర యాన్, వ్యవస్థాపకురాలు
శ్రీ అనుముల దయాకర్ గారు, శాతవాహన టైమ్స్ ఎడిటర్-ఆదిలాబాద్.
మేజర్ శ్రీ రేళ్ల సంజీవ్ గారు, అసిస్టెంట్ ప్రొఫెసర్, కరీంనగర్.
శ్రీ కొత్త అనిల్ కుమార్ గారు, సాహితీ గౌతమి ప్రధాన కార్యదర్శి, కరీంనగర్.

పుస్తక పరిచయం : శ్రీమతి ధూళిపాళ అరుణ గారు, ప్రముఖ కవయిత్రి, రచయిత్రి

తొలి ప్రతి స్వీకర్త : శ్రీ ఆశ్వాపురం వేణుమాధవ్ గారు, చాత్తాద శ్రీవైష్ణవ సంఘం రాష్ట్ర అధ్యక్షులు

సభా సమన్వయం : డా. పోరెడ్డి రంగయ్య గారు, ప్రముఖ కవి, రచయిత,
రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఉదయసాహితి, తెలంగాణ.

వందన సమర్పణ : శ్రీమతి మూర్తి శ్రీదేవి గారు, సంపాదకురాలు-అక్షరగీతం, రాష్ట్ర మహిళా కార్యదర్శి, ఉ.సా.తె.

ఆహ్వానించువారు :
రమాదేవి కులకర్ణి, రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఉ.సా.తె. పురిమళ్ల సునంద, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఉ.సా.తె.
డా. తులసి వెంకట రమణాచార్యులు, రాష్ట్ర సహాయ కార్యదర్శి, ఉ.సా.తె. లక్ష్మీ పద్మజ దుగ్గరాజు, రాష్ట్ర ప్రచార కార్యదర్శి, ఉ.సా.తె.

# రామమందిరం దివ్య ప్రాంగణం దేశ సమష్టి శక్తికి చైతన్య స్థలంగా మారుతోంది: ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, నవంబర్ 27:దేశ సామాజిక- సాంస్కృతిక, ఆధ్యాత్మిక రంగాల్లో ఓ చిరస్మరణీయ సందర్భాన్ని గుర్తుచేస్తూ.. ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో పవిత్రమైన శ్రీరామ జన్మభూమి ఆలయ శిఖరంపై ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నేడు కాషాయ వర్ణంలోని ధర్మ ధ్వజాన్ని ఎగురవేశారు. ఈ ధ్వజారోహణోత్సవం ఆలయ నిర్మాణం పూర్తవ్వడాన్ని సూచిస్తుంది. అలాగే భారత సాంస్కృతిక వేడుకలకు, జాతీయ ఐక్యతకు కొత్త అధ్యాయం ప్రారంభమైనట్లు తెలుపుతుంది. ఈ సందర్భంగా ప్రజలనుద్దేశించి ప్రధాని మాట్లాడుతూ.. "నేడు యావత్ భారత్, ప్రపంచం శ్రీరాముడి స్ఫూర్తితో నిండిపోయిందని వ్యాఖ్యానించారు. ప్రతి రామ భక్తుడి హృదయంలో ఒక ప్రత్యేక సంతృప్తి, అపారమైన కృతజ్ఞత, అనంతమైన ఆనందం ఉన్నాయని ఆయన అన్నారు. శతాబ్దాల నాటి గాయాలు మానిపోతున్నాయని, శతాబ్దాల బాధ ముగిసిపోతోందని, శతాబ్దాల సంకల్పాలు నేడు నెరవేరుతున్నాయని తెలిపారు. ఇది 500 సంవత్సరాలుగా జ్వలిస్తూనే ఉన్న యజ్ఞానికి ముగింపు ఇది అని ప్రధానమంత్రి పేర్కొన్నారు. విశ్వాసంలో ఎప్పుడూ చలించని, నమ్మకంలో ఒక్క క్షణం కూడా విచ్ఛిన్నం కాని యజ్ఞం ఇది అని అన్నారు. నేడు శ్రీరాముడి గర్భగుడిలోని అనంతమైన శక్తి, శ్రీరాముడి కుటుంబ దివ్య వైభవం ఈ ధర్మ ధ్వజం రూపంలో అత్యంత దివ్యమైన, గొప్ప ఆలయంలో ప్రతిష్ఠించినట్లు స్పష్టం చేశారు.

"ఈ ధర్మ ధ్వజం కేవలం ఒక జెండా మాత్రమే కాదు, భారతీయ నాగరికత పునరుజ్జీవన పతాకం" అని శ్రీ మోదీ పేర్కొన్నారు. జెండాలోని కాషాయ రంగు, దానిపై చెక్కిన సూర్య వంశపు వైభవం, పవిత్రమైన ఓం చిత్రం, చెక్కిన కోవిదార వృక్షం (మందార చెట్టు) రామరాజ్యం గొప్పతనాన్ని సూచిస్తాయని వివరించారు. "ఈ జెండా ఒక సంకల్పం, ఈ జెండా ఒక విజయం, ఈ జెండా పోరాటం ద్వారా జరిగిన సృష్టి గాథ, ఈ జెండా శతాబ్దాలుగా మోసుకెళ్లిన కలలకు నిదర్శనం.ఈ జెండా సాధువుల తపస్సు, సమాజ భాగస్వామ్యానికి సార్థకమైన ముగింపు'' అని తెలిపారు.

రాబోయే శతాబ్దాలు, వేల సంవత్సరాలకు ఈ ధర్మ ధ్వజం శ్రీరాముడి ఆదర్శాలు, సిద్ధాంతాలను ప్రపంచానికి తెలియజేస్తుందని ప్రధానమంత్రి శ్రీ నరేంద్రమోదీ వెల్లడించారు. విజయం సత్యానికే చెందుతుంది.. అబద్ధానికి కాదనే విషయాన్ని సూచిస్తుందన్నారు. సత్యమే బ్రహ్మ స్వరూపం, సత్యంలోనే ధర్మం స్థాపితమై ఉంటుందని తెలియజేస్తుందని చెప్పారు. ఇచ్చిన మాటను నెరవేర్చాలనే సంకల్పాన్ని ఈ ధర్మ ధ్వజం ప్రేరేపిస్తుందని, ప్రపంచంలో కర్మ, విధికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలనే సందేశాన్ని అందిస్తుందని తెలిపారు. బేదాభిప్రాయాలు, వివక్ష, బాధల నుంచి విముక్తి, సమాజంలో శాంతి, సంతోషం ఉండాలనే ఆకాంక్షను ఇది వ్యక్తపరుస్తుందన్నారు. పేదరికం లేని, ఎవరూ బాధపడని, నిస్సహాయంగా లేని సమాజాన్ని నిర్మించాలనే సంకల్పానికి ఈ ధర్మ ధ్వజం మనల్ని కట్టుబడి ఉండేలా చేస్తుందని స్పష్టం చేశారు.

మన గ్రంథాలను గుర్తు చేసుకుంటూ.. ఏ కారణం వల్లనైనా ఆలయానికి రాలేని వారు.. ధ్వజారోహణానికి నమస్కరించినా కూడా వారికి సమానమైన పుణ్యం లభిస్తుందని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ తెలిపారు. ఈ ధర్మ ధ్వజం ఆలయం ఉద్దేశ్యానికి ప్రతీక అని, యుగయుగాలుగా శ్రీరాముడి ఆజ్ఞలు, స్ఫూర్తిని మానవాళికి అందిస్తూ.. దూరం నుంచే శ్రీరాముడి జన్మస్థల దర్శనాన్ని అందిస్తుందని ఆయన చెప్పారు. ఈ మరపురాని, ప్రత్యేక సందర్భంలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది రామ భక్తులకు ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. భక్తులందరికీ నమస్కరించి, రామ మందిర నిర్మాణానికి సహకరించిన ప్రతి దాతకు కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ నిర్మాణంతో సంబంధం ఉన్న ప్రతి కార్మికుడికి, ప్రతి కళాకారుడికి, ప్రతి ప్లానర్‌కు, ప్రతి వాస్తుశిల్పికి ప్రధానమంత్రి వందనం చేశారు.

"ఆదర్శాలు ఆచరణగా మారే భూమి అయోధ్య" అని ప్రధానమంత్రి పేర్కొన్నారు. ఇదే నగరం నుంచి శ్రీరాముడు తన జీవిత ప్రయాణాన్ని ప్రారంభించాడని గుర్తుచేశారు. సమాజ శక్తి, విలువల ద్వారా ఒక వ్యక్తి ఎలా పురుషోత్తముడిగా మారతాడో అయోధ్యనే ప్రపంచానికి చూపించిందని ఆయన అన్నారు. శ్రీరాముడు అయోధ్యను విడిచి అరణ్యవాసానికి వెళ్లినప్పుడు యువరాజుగా ఉన్నాడని, కానీ తిరిగి వచ్చినప్పుడు 'మర్యాద పురుషోత్తముడిగా' వచ్చాడని ప్రధానమంత్రి ప్రస్తావించారు. శ్రీరాముడు మర్యాద పురుషోత్తముడిగా అవతరించడంలో మహర్షి వశిష్ఠుడి జ్ఞానం, మహర్షి విశ్వామిత్రుడి ఉపదేశం, మహర్షి అగస్త్యుడి మార్గదర్శనం, నిషాద రాజు స్నేహం, మాత శబరి ఆప్యాయత, హనుమంతుడి భక్తి అన్నీ కీలకపాత్ర పోషించాయని ప్రధానమంత్రి వివరించారు.

అభివృద్ధి చెందిన భారత్ ను నిర్మించేందుకు సమాజ సమష్టి శక్తి అత్యంత అవసరమని ప్రధానమంత్రి పేర్కొన్నారు. రామ మందిర దివ్య ప్రాంగణం దేశ సామూహిక శక్తికి చైతన్య స్థలంగా మారుతున్నందుకు మోదీ హర్షం వ్యక్తం చేశారు. గిరిజనుల ప్రేమ, ఆతిథ్య సంప్రదాయాలకు ప్రతీక అయిన మాత శబరి దేవాలయం సహా మొత్తం ఏడు దేవాలయాలు ఇక్కడ నిర్మించినట్లు తెలిపారు. నిషాదరాజు ఆలయం స్నేహానికి సాక్ష్యంగా నిలుస్తుందన్నారు. స్నేహం విలువ దాని ప్రయోజనాల్లో కాదు... ప్రేమలో, నమ్మకంలో, గౌరవంలో ఉంటుం దని, నిషాదరాజు ఆలయం ఈ భావాన్ని గుర్తు చేస్తుందని అన్నారు.

ఒకే ప్రాంగణంలో మాత అహల్య, మహర్షి వాల్మీకి, మహర్షి వశిష్ఠ, మహర్షి విశ్వామిత్ర, మహర్షి అగస్త్య, సంత్ తులసీదాస్ విగ్రహాలు రామ మందిర పరిసరాల్లో ఉండంటతో భక్తులు వారందరి దర్శనం ఒకే చోట పొందగలుగుతున్నారని ప్రధానమంత్రి తెలిపారు. గొప్ప సంకల్పాలను సాధించడంలో చిన్న సహాయాలు కూడా ఎంత విలువైనవో తెలిపే జటాయువు, ఉడుత విగ్రహాలను ఆయన ప్రస్తావించారు. రామ మందిరాన్ని సందర్శిం చినప్పుడల్లా, తప్పకుండా ఈ ఏడు ఆలయాలను కూడా సందర్శించాలని ప్రధానమంత్రి కోరారు. ఈ ఆలయాలు మన విశ్వాసాన్ని బలోపేతం చేయడంతో పాటు, స్నేహం, కర్తవ్యం, సామాజిక సామరస్యం వంటి విలువలను కూడా శక్తిమంతం చేస్తాయని చెప్పారు.

''మన రాముడు విభేదాల ద్వారా కాకుండా, భావోద్వేగాల మనల్ని కలుపుతాడు'' అని శ్రీ మోదీ అన్నారు. శ్రీరాముడికి వంశం కంటే వ్యక్తి భక్తి ముఖ్యమని, వారసత్వం కంటే విలువలు గొప్పవని, శక్తి కంటే సహకారం గొప్పదని పేర్కొన్నారు. నేడు మనం కూడా అదే స్ఫూర్తితో ముందుకు సాగుతున్నామని వ్యాఖ్యానించారు. గత 11 సంవత్సరాల్లో మహిళలు, దళితులు, వెనుకబడిన వర్గాలు, గిరిజనులు, పేదలు, రైతులు, కార్మికులు, యువత.. ఇలా సమాజంలోని ప్రతి వర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లామని చెప్పారు. దేశంలోని ప్రతి వ్యక్తి, ప్రతి వర్గం, ప్రతి ప్రాంతం శక్తిమంతమైనప్పుడు ప్రతి ఒక్కరి కృషి సంకల్ప సాధనకు దోహదం చేస్తుందన్నారు. ఈ సామూహిక కృషి వల్లే 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్ నిర్మితమవుతుందని ప్రధానమంత్రి స్పష్టం చేశారు.

రామ్ లల్లా ప్రాణ ప్రతిష్ఠ జరిగిన చరిత్రాత్మక సందర్భాన్ని గుర్తుచేసుకుంటూ ప్రధానమంత్రి దేశ సంకల్పాన్ని రాముడితో అనుసంధానించడం గురించి ప్రస్తావించారు. రాబోయే వెయ్యి సంవత్సరాల వరకు భారత పునాదులను బలోపేతం చేయాలని గుర్తు చేశారు. వర్తమానం గురించి మాత్రమే ఆలోచిం చేవారు భవిష్యత్ తరాలకు అన్యాయం చేస్తారనీ... మనం ఈ రోజు గురించి మాత్రమే కాకుండా రాబోయే తరాల గురించి కూడా ఆలోచించాలని ఆయన సూచించారు. దేశం మనకు ముందూ ఉంది... మన తర్వాత కూడా అది కొనసాగుతుంది. ఒక శక్తిమంతమైన సమాజంగా మనం రాబోయే దశాబ్దాలు, శతాబ్దాలను దృష్టిలో ఉంచుకుని దూరదృష్టితో పని చేయాలన్నారు. దీని కోసం మనం రాముడి నుంచి ఎంతో నేర్చుకోవాలి... ఆయన మహోన్నత వ్యక్తిత్వాన్ని అర్థం చేసుకోవాలి... ఆయన ప్రవర్తనను స్వీకరించాలి... రాముని ఆదర్శాలను, క్రమశిక్షణను, ఆయన జీవితంలోని అత్యున్నత స్వభావాన్ని మనం అలవర్చుకోవాలని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. రాముడు సత్యం, శౌర్యాల సంగమం... ధర్మ మార్గంలో నడిచే దైవ స్వరూపం... అన్నింటికంటే ప్రజల ఆనందానికి అత్యంత ప్రాధాన్యమిచ్చే గొప్ప వ్యక్తిత్వం... సహనం, క్షమా గుణాల సముద్రం... జ్ఞానం, విజ్ఞానాల మహోన్నత శిఖరం... సౌమ్యత మూర్తీభవించిన దృఢత్వం... కృతజ్ఞతకు నిలువెత్తు నిదర్శనం... మంచి సహవాసాన్ని ఎంచుకున్న నైపుణ్యం... గొప్ప బలంలోనూ వినయం, సత్యాలను ఆచరించే అచంచల సంకల్పం.... అప్రమత్తత, క్రమశిక్షణ, నిజాయతీ నిండిన హృదయం.... రాముడి ఈ లక్షణాలు బలమైన, దార్శనికమైన, శాశ్వతమైన దేశాన్ని నిర్మించడంలో మనకు మార్గనిర్దేశం చేయాలని ప్రధానమంత్రి అన్నారు.

"రాముడు కేవలం ఒక వ్యక్తి కాదు... ఒక విలువ, ఒక క్రమశిక్షణ, ఒక దిశ" అని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు. 2047 నాటికి భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారాలంటే, సమాజం సాధికారత పొందాలంటే... మనలో ప్రతి ఒక్కరిలో రాముడు మేల్కొనాలి... మన హృదయాలన్నీ పవిత్రం కావాలి అని ప్రధానమంత్రి పేర్కొన్నారు. అటువంటి సంకల్పం తీసుకోవడానికి ఈ రోజు కంటే మంచి రోజు మరొకటి ఉండదని ఆయన స్పష్టం చేశారు. నవంబర్ 25 మన వారసత్వంలో మరొక అసాధారణ సందర్భంగా నిలుస్తుందన్నారు. ధర్మ ధ్వజంపై చెక్కిన కోవిదార్ వృక్షం దీనిని సూచిస్తుందని ఆయన పేర్కొన్నారు. మన మూలాల నుంచి మనల్ని మనం వేరు చేసుకుంటే... మన కీర్తి చరిత్ర పుటల్లో ఖననం అవుతుం దని మనకు కోవిదార్ వృక్షం గుర్తు చేస్తుందని ఆయన వివరించారు.

భరతుడు తన సైన్యంతో చిత్రకూట్ చేరుకున్న సందర్భంలో దూరం నుంచే లక్ష్మణుడు అయోధ్య సేనను గుర్తించిన ఘట్టాన్ని ప్రధానమంత్రి గుర్తుచేసుకున్నారు. ఒక గొప్ప వృక్షాన్ని పోలిన ప్రకాశవంతమైన, అత్యంత ఎత్తయిన పతాకం అయోధ్యదేననీ... కోవిదార్ వృక్ష శుభ చిహ్నంతో వారిని గుర్తించాననీ లక్ష్మణుడు రాముడితో చెప్పినట్లు వాల్మీకి రాసిన వర్ణనను శ్రీ మోదీ ప్రస్తావించారు. రామమందిరం ప్రాంగణంలో ఈ రోజు మరోసారి కోవిదార్ వృక్షాన్ని ప్రతిష్ఠిస్తున్న సందర్భం... కేవలం ఒక వృక్షం తిరిగి రావడం మాత్రమే కాదు... మన జ్ఞాపకా లు తిరిగి రావడం... గుర్తింపు పునరుజ్జీవనం పొందడం... గర్వించదగిన నాగరికతను పునరుద్ధరించడం గురించిన ప్రకటన అవుతుందని ఆయన స్పష్టం చేశారు. మన గుర్తింపును మనం మరచిపోయినప్పుడు, మనల్ని మనం కోల్పోతాం... గుర్తింపు తిరిగి వచ్చినప్పుడు, దేశం ఆత్మవిశ్వాసం కూడా తిరిగి వస్తుందనే గొప్ప సత్యాన్ని కోవిదార్ మనకు గుర్తు చేస్తుందని శ్రీ మోదీ తెలిపారు. దేశం ముందుకు సాగాలంటే... దాని వారసత్వాన్ని గర్వంగా భావించాలని చెబుతూ ఆయన పేర్కొన్నారు.

మన వారసత్వం పట్ల గర్వంతో పాటు... బానిసత్వ మనస్తత్వం నుంచి పూర్తిగా విముక్తి పొందడమూ అంతే ముఖ్యమని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. 190 సంవత్సరాల కిందట అంటే 1835లో మెకాలే అనే ఆంగ్ల పార్లమెంటేరియన్ భారతదేశాన్ని దాని మూలాల నుండి పెకిలించి, మనలో మానసిక బానిసత్వానికి పునాది వేశారని ప్రధానమంత్రి గుర్తు చేశారు. 2035 నాటికి ఆ ఘటన జరిగి రెండు వందల సంవత్సరాలు పూర్తవుతాయని ఆయన పేర్కొన్నారు. రాబోయే పదేళ్ళ దేశాన్ని బానిస మనస్తత్వం నుంచి పూర్తిగా విముక్తి చేయడానికి అంకితం చేయాలని కోరారు. మెకాలే ఆలోచనలు విస్తృత ప్రభావాన్ని చూపడం అత్యంత దురదృష్టకరమని ఆయన విచారం వ్యక్తం చేశారు. భారత దేశం స్వాతంత్ర్యం పొందింది... కానీ న్యూనతా భావాల నుంచి విముక్తి పొందలేదని ఆయన చేసిన వ్యాఖ్యలు చాలా ప్రభావం చూపాయని ప్రధానమంత్రి తెలిపారు. విదేశీయులకు చెందిన ప్రతి విషయాన్ని గొప్పదిగా భావిస్తూ... మన దేశ సాంప్రదాయాలు, వ్యవస్థల్లో తప్పులను చూసేలా ఆ మాటలు అందరినీ ప్రభావితం చేశాయన్నారు.

భారత్ ప్రజాస్వామ్యాన్ని విదేశాల నుంచి స్వీకరించిందనే భావనను... మన రాజ్యాంగం కూడా విదేశీ ప్రేరణతో రూపొందించారనే భావనను బానిసత్వ మనస్తత్వం మరింత బలోపేతం చేస్తోందని శ్రీ మోదీ పేర్కొన్నారు. నిజానికి భారత్ ప్రజాస్వామ్యానికి తల్లి వంటిది... ప్రజాస్వామ్యం మన డీఎన్ఏలోనే ఉంది. ఉత్తర తమిళనాడులోని ఉత్తిరమేరూర్ గ్రామంలో వెయ్యి సంవత్సరాల పురాతన శాసనం మన పాలన ప్రజాస్వామ్యబద్ధంగా సాగిన తీరునూ, ఆ యుగంలో కూడా ప్రజలు తమ పాలకులను ఎన్నుకున్న విధానాన్ని తెలియజేస్తుందని ఆయన స్పష్టం చేశారు. మాగ్నా కార్టాకు విస్తృత ప్రశంసలు లభించగా... మన భగవాన్ బసవన్న అనుభవ మంటప జ్ఞానాన్ని మరుగునపడేలా చేశారని ఆయన పేర్కొన్నారు. సామాజిక, మతపరమైన, ఆర్థిక అంశాలను బహిరంగంగా చర్చించే... సమష్టిగా ఏకాభిప్రాయంతో నిర్ణయాలు తీసుకునే వేదిక అనుభవ మంటపం అని ఆయన వివరించారు. బానిసత్వ మనస్తత్వం కారణంగా దేశంలోని తరతరాలు తమ సొంత ప్రజాస్వామ్య సంప్రదాయాల గురించిన ఈ జ్ఞానాన్ని తెలుసుకోలేకపోయాయని ఆయన విచారం వ్యక్తం చేశారు.

మన వ్యవస్థలోని ప్రతి మూలలోనూ బానిసత్వ మనస్తత్వం పాతుకుపోయిందని ప్రధానమంత్రి పేర్కొన్నారు. శతాబ్దాలుగా భారత నావికాదళ పతాకంలో భారత నాగరికత బలం, వారసత్వంతో సంబంధం లేని చిహ్నాలను కలిగి ఉండేదని ఆయన గుర్తు చేశారు. ఇప్పుడు నావికాదళ పతాకం నుంచి బానిసత్వానికి సంబంధించిన ప్రతి చిహ్నాన్ని తొలగించామనీ... ఛత్రపతి శివాజీ మహారాజ్ వారసత్వాన్ని స్థాపించామని ఆయన స్పష్టం చేశారు. ఇది కేవలం డిజైన్‌లో మార్పు కాదనీ... మనస్తత్వంలో పరివర్తన తెచ్చే క్షణం అన్నారు. భారత్ ఇకపై తన బలాన్ని ఇతరుల వారసత్వం ద్వారా కాకుండా దాని సొంత చిహ్నాల ద్వారానే నిర్వచిస్తుందని శ్రీ మోదీ స్పష్టం చేశారు.

అయోధ్యలో నేడు అదే పరివర్తన కనిపిస్తోందని శ్రీ మోదీ అన్నారు. చాలా సంవత్సరాలుగా రామతత్వ సారాన్ని తిరస్కరించింది బానిసత్వ మనస్తత్వమేనని ఆయన స్పష్టం చేశారు. ఓర్చా రాజా రాముడి నుంచి రామేశ్వరం భక్త రాముడి వరకు... శబరి ప్రభు రాముడి నుంచి మిథిలా నగర పహునా రామ్ జీ వరకు శ్రీరాముడు తనలో తాను సంపూర్ణ విలువల వ్యవస్థ అని శ్రీ మోదీ తెలిపారు. ప్రతి ఇంట్లో, ప్రతి భారతీయ హృదయంలో, దేశంలోని ప్రతి కణంలో రాముడు నివసిస్తున్నాడు. బానిసత్వ మనస్తత్వం ఎంతగా ప్రబలిందంటే... రాముడిని కూడా ఊహాజనిత పాత్రగా వారు ప్రకటించే పరిస్థితి వచ్చిందని ఆయన విచారం వ్యక్తం చేశారు.రాబోయే పదేళ్లలో బానిసత్వ మనస్తత్వం నుంచి పూర్తిగా విముక్తి పొందాలని మనం సంకల్పించుకుంటే... 2047 నాటికి వికసిత్ భారత్ కల సాకారాన్ని ఏ శక్తీ ఆపలేనంత ఆత్మవిశ్వాస జ్వాల రగులుతుందని శ్రీ మోదీ స్పష్టం చేశారు.

## స్కైరూట్ మొదటి కక్ష రాకెట్ విక్రమ్‌ఎ ను ఆవిష్కరించనున్న ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, నవంబర్ 27: భారత అంతరిక్ష అంకుర సంస్థ స్కైరూట్ ఇన్ఫినిటీ క్యాంపస్‌ను నవంబర్ 27న ఉదయం 11 గంటలకు వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా ప్రధానమంత్రి ప్రారంభించనున్నారు. ఉపగ్రహాలను కక్ష్యలోకి ప్రవేశపెట్టగల సామర్థ్యం కలిగిన స్కైరూట్ మొదటి కక్ష రాకెట్ విక్రమ్-ఎను కూడా ఆయన ఆవిష్కరించనున్నారు.

అత్యాధునిక సౌకర్యాలతో సుమారు 200,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో దీని కార్యాలయాన్ని నిర్మించారు. ఇక్కడ బహుళ ప్రయోగ వాహనాలను రూపొందించడం, అభివృద్ధి చేయడం, సమగ్రపరచడం, పరీక్షించడానికి ఉపయోగపడుతుంది. ఈ క్యాంపస్ ప్రతి నెలా ఒక కక్ష రాకెట్‌ను తయారుచేసే సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది.

స్కైరూట్ దేశంలోని ప్రముఖ ప్రైవేటు అంతరిక్ష సంస్థ. దీనిని పవన్ చందన, భరత్ ఢాకా స్థాపించారు, వీరిద్దరూ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ పూర్వ విద్యార్థులు....ఇస్రో మాజీ శాస్త్రవేత్తలు. స్కైరూట్ తన ఉప-కక్ష రాకెట్ అయిన విక్రమ్-ఎస్ ను 2022 నవంబర్ లో ప్రయోగించింది. దీని ద్వారా అంతరిక్షంలోకి రాకెట్‌ను ప్రయోగించిన తొలి భారత ప్రైవేటు సంస్థగా స్కైరూట్ నిలిచింది.

ప్రైవేటు అంతరిక్ష సంస్థల వేగవంతమైన అభివృద్ధి.. గత కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వం చేపట్టిన విప్లవాత్మక సంస్కరణల విజయానికి నిదర్శనం. ఇది ఆత్మవిశ్వాసంతో కూడిన, సమర్థవంతమైన ప్రపంచ అంతరిక్ష శక్తిగా భారత్ నాయకత్వాన్ని బలోపేతం చేస్తుంది.

## మెగా పీటీఎం 3.0కు భారీ ఏర్పాట్లు

తిరుపతి, నవంబర్ 27: రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న మెగా తల్లిదండ్రులు ఉపాధ్యాయుల సమావేశం (పీటీఎం 3.0 ) కార్యక్రమాన్ని తిరుపతి జిల్లాలో డిసెంబర్ 5న అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఏకకాలంలో ఘనంగా నిర్వహించాలంటూ కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు.

గతంలో జరిగిన మెగా పీటీఎం 1.0, 2.0 విజయాలను దృష్టిలో ఉంచుకొని, ఈసారి మరింత సమగ్రంగా, ప్రభావవంతంగా కార్యక్రమం సాగాలని ఆయన సూచించారు. ఇందుకోసం ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ముందస్తుగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

మెగా పీటీఎం 3.0లో ప్రజాప్రతినిధులు, జిల్లా, మండల అధికారులు, పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు, పూర్వ విద్యార్థులు, దాతలు, తల్లిదండ్రులు, ముఖ్యంగా తండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.

పాఠశాల ల్లో విద్యార్థుల భవిష్యత్తు, పాఠశాలాభివృద్ధిపై చర్చ జరిగేలా కార్యక్రమాన్ని సమగ్రంగా రూపుదిద్దాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కార్యక్ర మంలోని ముఖ్య అంశాలను వివరించారు.

ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులను భాగస్వామ్యం చేసేందుకు ప్రత్యేక ఇంటరాక్టివ్ సెషన్లు, తల్లుల కోసం రంగోలి పోటీలు నిర్వహించనున్నారు. విద్యార్థుల అకడమిక్, ప్రవర్తన, హాజరు, నైపుణ్యాలు, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు వంటి అన్ని అంశాలను కలిగిన హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులను తల్లిదండ్రులకు అందజేయనున్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టి, ప్రతి తల్లిదండ్రితో ఉపాధ్యాయులు వ్యక్తిగతంగా మాట్లాడి సూచనలు ఇవ్వనున్నారు.

# పీ-4 కార్యక్రమానికి బాసటగా నిలవాలి

**-నూజివీడు నియోజకవర్గ అభివృద్ధికి ముందుకు రావాలి**

**-నావంతు సాయంగా రూ 10 లక్షలు అందజేస్తాను**

**-గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి**




అమరావతి, నవంబర్ 27:నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం నూజివీడు నియోజకవర్గ అభివృద్ధి కోసం పబ్లిక్ ప్రైవేటు పీపుల్స్ పార్టనర్ షిప్ ఫోరంలో వివిధ శాఖలు అధికారులు, బ్యాంకు అధికారులతో రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీ-4 కార్యక్రమం అమలుపై సమీక్షించారు.

అనంతరం మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రాన్ని పారిశ్రామిక రంగంగా అభివృద్ధిపథంలో నిలిపేందుకు ప్రపంచ వ్యాప్తంగా పారిశ్రామిక వేత్తలను మన రాష్ట్రంలో పెట్టుబాటులు పెట్టేందుకు ఆహ్వానిస్తూ, పరిశ్రమలు స్థాపనకు విశేష కృషి చేస్తున్నారని అన్నారు. ముఖ్యమంత్రి ఇచ్చిన పిలుపు మేరకు ఇటీవల విశాఖపట్నంలో సీఐఐ సదస్సులో ప్రపంచవ్యాప్తంగా పారిశ్రామిక వేత్తలు స్పందించి 12 లక్షల కోట్ల రూపాయలకు పైగా రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చారన్నారు. పరిశ్రమలు స్థాపనతో రాష్ట్రం ఆర్థికంగా అభివృద్ధి బాటను పెట్టడంతో పాటు, రాష్ట్రంలోని యువతీ, యువకులకు ఉద్యోగ అవకాశాలు మెండుగా కలుగుతాయని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రికి ఇష్టమైన పీ4 కార్యక్రమానికి మనమంతా బాసటగా నిలవాలని అన్నారు.

నూజివీడు నియోజకవర్గం అభివృద్ధికి పారిశ్రామిక వేత్తలు, ప్రభుత్వ ఉద్యోగులు, బ్యాంకు అధికారులు పెద్ద మనస్సుతో ముందుకు రావాలని కోరారు. అందరూ ముందుకు వస్తే తొలి నావంతు సాయంగా రూ.10 లక్షలు అందజేస్తానని అన్నారు. పోలీసు వ్యవస్థ పనితీరు అభినందనీయమని, దొంగతనం జరిగిన కొన్ని గంటలకే నగదును, బంగారాన్ని రికవరీ చేసి, దొంగలను అరెస్టు చేయటం జరుగుతుందని, ప్రజలకు భద్రత కల్పించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. సమాజంలో పేద, బడుగు బలహీన వర్గాలు వారిని ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం చేసేందుకు పీ-4 ప్రారంభించామని, ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు.

సమాజంలో సంపన్నులు (మార్గదర్శకులు) పేద, బలహీన వర్గాల వారిని (బంగారు కుటుంబాలు) దత్తత తీసుకొని వారికి చేయూతనిస్తే వారు ఆర్థికంగా ఎదుగుతారన్నారు. సమాజం ద్వారా సంపన్నులుగా ఎదిగిన వారు పేదలను ఆదుకోవడం ద్వారా సమాజ సేవ చేసిన వారవుతారన్నారు. అందరం కలిసికట్టుగా పనిచేస్తే బంగారు కుటుంబాలు వారు మంచి జీవన ప్రమాణాలతో జీవనం సాగిస్తారన్నారు. పేదరికం లేని సమాజాన్ని తీర్చిదిద్దడానికి ప్రభుత్వ సంకల్పం నెరవేరేలా ప్రతి ఒక్కరు భాగస్వాములై ఈ కార్యక్రమాన్ని కలిసికట్టుగా విజయవంతం చేద్దామని అన్నారు. ఈ సమావేశంలో సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, పారిశ్రామికవేత్తలు, వివిధ శాఖలు అధికారులు, బ్యాంకు అధికారులు, పట్టణ ప్రముఖులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# ఎన్నికల సంస్కరణలపై సమీక్ష




తిరుపతి, నవంబర్ 27: ఎలక్టోరల్ రోల్స్, ఓటర్ మ్యాపింగ్, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్-2026 సన్నాహక చర్యలపై రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ వివేక్ యాదవ్ గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. విజయవాడ సచివాలయంలోని చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ కార్యాలయం నుంచి జరిగిన ఈ సమావేశంలో, తిరుపతి జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో నుంచి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ పాల్గొన్నారు. ఆయనతో పాటు డీఆర్ఓ నరసింహులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు సుధారాణి, రోజ్ మాండ్, ఆర్డీవోలు రామ్మోహన్, భాను ప్రకాశ్ రెడ్డి, కిరణ్మయి తదితర అధికారులు హాజరయ్యారు.

రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్‌కు కలెక్టర్ వివరణ ఇస్తూ, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్-2026 కార్యక్రమం కోసం ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలు, ఈడిటిలు, ఈఎస్ఏలకు అవసరమైన శిక్షణ ఇప్పటికే అందించామని తెలిపారు. ఓటర్ మ్యాపింగ్‌కు సంబంధించిన పనులు జిల్లాలో పూర్తయ్యాయని చెప్పారు. కొత్తగా ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలకు బిఎల్‌ఓలను నియమించేందుకు ప్రతిపాదనలు వెంటనే పంపిస్తామని వెల్లడించారు. జిల్లాలో పనిచేస్తున్న బిఎల్‌ఓలకు ఐడికార్డులు పంపిణీ పూర్తి చేశామని, పెండింగ్‌లో ఉన్న వివిధ ఫారమ్‌ల పనులు వేగంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు.

## కాకతీయ యూనివర్సిటీలో సమస్యలు పరిష్కరించాలి : జేఏసీ చైర్మన్ బొచ్చు తిరుపతి

హనుమకొండ, నవంబర్ 27: కాకతీయ విశ్వవిద్యాలయంలో అనేక సమస్యలు ఉన్నాయని వెంటనే యూనివర్సిటీ అధికారులు పరిష్కరించాలని కేయూ నూతన జేఏసీ చైర్మన్‌గా కేయూ పరిశోధక విద్యార్థి బొచ్చు తిరుపతి డిమాండ్ చేశారు. కాకతీయ యూనివర్సిటీ గ్రంథాలయం వద్ద గురువారం ఏ.బి.ఎస్.ఎఫ్, బీ.సీ విద్యార్థి సంఘం, బి.ఎస్.ఎఫ్, ఎం. ఎస్. ఎఫ్,ఎస్.ఎస్.యు ,డీ.ఎస్.ఏ ,ఎస్.ఎస్. బి.ఎం, డి.ఎస్.యూ,సేవలాల్ విద్యార్థిసేన, మాదిగ విద్యార్థి వేదిక సంఘాల ఆధ్వర్యంలో నూతన జేఏసీని ఎన్నుకున్నారు.

నూతన విద్యార్థి జెఏసీ చైర్మన్‌గా జీవ సాంకేతిక శాస్త్ర పరిశోధక విద్యార్థి బొచ్చు తిరుపతిని ఏక గ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు.

ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ విద్యార్థుల నిరుద్యోగుల సంక్షేమం కోసమే జేఏసీ ఏర్పాటు చేశామమని, రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల సమస్యలు పరిష్కారం చేయకపోతే ఉద్యమం మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. నూతన జీఏసీ వైస్ చైర్మన్ గా కామగాని శ్రవణ్‌కుమార్, కేయూ జేఏసీ కన్వీనర్‌గా బొట్ల మనోహర్, కో-కన్వీనర్‌గా ఎల్తూరి సాయికుమార్, పెండాల రాకేష్‌ను ఎన్నుకోవడం జరిగిందన్నారు. గతంలో ఉన్న జేఏసీలను రద్దు చేశామని, ప్రస్తుత జేఏసీ నేటి నుంచి కొనసాగుతుందన్నారు.

కార్య క్రమంలో ఏబిఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మంద నరేశ్, ఉప్పల శివ, రాజేశ్, కిరణ్, సాయి, పల్లవి, స్నేహలత, ప్రసన్న, అపర్ణ, దివ్య పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరి పాత్ర కీలకం

నారాయణపేట, నవంబర్ 27: జిల్లాలో బాల్య వివాహాలను సంపూర్ణంగా నిర్మూలించి నారాయణపేటను బాల్య వివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్దడం ప్రతి పౌరుడి బాధ్యత అని స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్అన్నారు.ఈ రోజు జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన బేటీ బచావో - బేటీ పడావో కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడాతూ.. "జిల్లాలో ప్రతి ఏటా 50-60 వరకు బాల్య వివాహాలను ఆ శాఖ అధికారులు అరికడుతున్నారు.

ఇంకా పూర్తి స్థాయిలో నిరోధించేందుకు సమాజం మొత్తం బాధ్యత తీసుకోవాలి" అని తెలిపారు. బాల్య వివాహాల గురించి సమాచారం లభిస్తే వెంటనే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 కు తెలియజేయాలని పిలుపునిచ్చారు.

సమాచారం ఇచ్చిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని, ఎవరూ భయపడవద్దని హామీ ఇచ్చారు. ట్రైనీ కలెక్టర్ ప్రణయ్ కుమార్ మాట్లాడుతూ.. బాల్య వివాహాల వల్ల సంభవించే ఆరోగ్య, సామాజిక సమస్యలను వివరించారు.

